సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

www.mudranews.in

హైదరాబాద్
గురువారం, 06.08.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 275
పేజీలు: 08 వెల: రూ. 5



## 8 సెకన్లలోనే నిద్రలోకి..

- 100% అటెండెన్స్ ఉండాలి
- ప్రతిపక్షాల నుంచీ నేర్చుకోండి
- కొత్త ఎంపీలకు మోదీ కీలక సూచనలు

రోజుకు
మూడు గంటలే నిద్ర

02



### మోదీ వ్యూహానికి

# జెన్-జీ చెక్

## జెన్-జీ నిరసనలతో కేంద్రం వ్యూహంలో మార్పు?

- ప్రత్యేక సమావేశాల్లో డీలిమిటేషన్ బిల్లుకు అవకాశం
- వర్షాకాల సమావేశాల్లో కీలక బిల్లులకు బ్రేక్
- వన్ నేషన్-వన్ ఎలక్షన్ బిల్లు వాయిదా?
- ప్రతిపక్ష ఆందోళనలతో కేంద్రం వెనకడుగు?
- రాజ్యాంగ సవరణలపై ప్రత్యేక సెషన్ చర్చ
- డీలిమిటేషన్ బిల్లుపై కేంద్రం కొత్త వ్యూహం

**ముద్ర, న్యూఢిల్లీ:**
దేశ రాజకీయ సమీకరణాలను శాశ్వతంగా ప్రభావితం చేసే కీలక రాజ్యాంగ సవరణ బిల్లులను వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లోనే ఆమోదింపజేయాలన్న కేంద్ర ప్రభుత్వ వ్యూహానికి అనూహ్యంగా ఆటంకాలు ఎదురయ్యాయి. 'వన్ నేషన్–వన్ ఎలక్షన్', డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల అమలు వంటి కీలక అంశాలపై బిల్లులను ప్రవేశపెట్టేందుకు అవసరమైన సంఖ్యాబలం, మిత్రపక్షాల మద్దతు సిద్ధంగా ఉన్నప్పటికీ, సభలో ప్రతిపక్షాల నిరసనలు, వెలుపల జెన్–జీ యువత ఆందోళనల నేపథ్యంలో కేంద్రం వ్యూహాన్ని పునఃపరిశీలిస్తున్నట్లు చర్చ జరుగుతోంది.
ఢిల్లీలో జెన్–జీ యువత, విద్యార్థి సంఘాలు నిరుద్యోగం, పోటీ పరీక్షల నిర్వహణ, రాజ్యాంగ మార్పులపై ఆందోళన వ్యక్తం చేస్తూ చేపట్టిన నిరసనలు పార్లమెంట్‌పై ప్రభావం చూపాయి. ఈ ఉద్యమాలకు ఇండియా కూటమి మద్దతు ప్రకటించడంతో ఉభయ సభల్లో తీవ్ర గందరగోళం నెలకొంది. ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి సభా కార్యక్రమాలను అడ్డుకోవడంతో కీలక బిల్లుల ప్రవేశానికి అనుకూల వాతావరణం లేకుండా పోయింది.

**2029 లక్ష్యంగా కేంద్రం వ్యూహం**

2029 సాధారణ ఎన్నికల నాటికి దేశవ్యాప్తం గా వన్ నేషన్–వన్ ఎలక్షన్ అమలు చేయడం, డీలిమిటేషన్ అనంతరం మహిళా రిజర్వేషన్లను అమల్లోకి **మిగతా 02లో**

### డయల్ 100 ప్లేస్‌లో

# డయల్ 112

## అన్ని అత్యవసర సేవలకు ఒకే నంబర్

### డయల్ 100కు గుడ్ బై

- పోలీస్, అంబులెన్స్, ఫైర్ సేవలు డయల్ 112 ద్వారానే అందుబాటులోకి
- డయల్ 112 ద్వారా 18 రకాల సేవలు
- ఒకేసారి 960 కాల్స్ స్వీకరించే అత్యాధునిక కాల్ సెంటర్
- కొత్త ఎమర్జెన్సీ కాల్ సెంటర్ ప్రారంభించిన డీజీపీ సీవీ ఆనంద్
- 24 గంటల సేవలు.. కాలర్ లొకేషన్ ఆధారంగా వెంటనే స్పందించే వ్యవస్థ



**ముద్ర డెస్క్:**
తెలంగాణలో అత్యవసర సేవల రంగంలో కీలక మార్పు చోటుచేసుకుంది. ఇకపై ఏ ఆపద వచ్చినా ప్రజలు వేర్వేరు నంబర్ల కోసం వెతకాల్సిన అవసరం లేదు. పోలీస్, అంబులెన్స్, అగ్నిమాపక, మహిళా భద్రత, సైబర్ సహాయం, న్యాయ సాయం తదితర అత్యవసర సేవలన్నీ డయల్ 112 ద్వారా ఒకే వేదికపై అందుబాటులోకి వచ్చాయి. రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (TGICCC) నుంచి అత్యాధునిక డయల్ 112 ఎమర్జెన్సీ రెస్పాన్స్ సిస్టం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన డీజీపీ సీవీ ఆనంద్, రాష్ట్రంలో ఇప్పటివరకు అమల్లో ఉన్న డయల్ 100 సేవలకు బదులుగా ఇకపై డయల్ 112 ప్రధాన అత్యవసర నంబర్‌గా పనిచేస్తుందని వెల్లడించారు. ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయడం, అత్యవసర పరిస్థితుల్లో స్పందన సమయాన్ని గణనీయంగా తగ్గించడం ఈ వ్యవస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు.

**18 రకాల అత్యవసర సేవలు**

డయల్ 112 ద్వారా కేవలం పోలీసు సేవలే కాకుండా అంబులెన్స్, ఫైర్ సర్వీసులు, మహిళల భద్రత, చిన్నారుల రక్షణ, సైబర్ నేరాలపై సహాయం, న్యాయ సలహా, విపత్తుల సమయంలో స్పందన వంటి మొత్తం 18 రకాల అత్యవసర సేవలు ప్రజలకు అందుబాటులో ఉంటాయని డీజీపీ తెలిపారు. ఎవరైనా 112కు ఫోన్ చేస్తే కాల్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ తిరస్కరించబోమని, ప్రతి కాల్‌ను అత్యంత ప్రాధాన్యంతో స్వీకరించి సంబంధిత శాఖలకు పంపిస్తామని స్పష్టం చేశారు.

**ఒకేసారి 960 కాల్స్**

ప్రజలకు వేగవంతమైన సేవలు అందించేందుకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన కొత్త కాల్ సెంటర్‌ను కమాండ్ కంట్రోల్ సెంటర్ టవర్–బీలో ఏర్పాటు చేశారు. ఒకేసారి 960 ఫోన్ కాల్స్‌ను స్వీకరించే సామర్థ్యం ఈ కేంద్రానికి ఉండటంతో భారీ స్థాయిలో అత్యవసర పరిస్థితులు వచ్చినా సేవలకు అంతరాయం ఉండదని అధికారులు తెలిపారు. కాల్ వచ్చిన వెంటనే కాలర్ లొకేషన్‌ను అడ్వాన్స్‌డ్ లొకేషన్ టెక్నాలజీ (Advanced Location System) ద్వారా గుర్తించి సమీపంలోని పోలీస్, అంబులెన్స్, ఫైర్ సిబ్బందిని అప్రమత్తం చేసేలా వ్యవస్థను రూపొందించారు. **మిగతా 02లో**



### రంగనాథ్ సంతకం

# ఫోర్జరీ

- ఎనిమిది జూనియర్ కాలేజీలపై కేసులు నమోదు..
- మరో 60 కాలేజీల ఫైర్ ఎన్‌ఓసీలపై విచారణ

02

*ఇది మామూలు మోసం కాదు. వాళ్లు మామూలు వ్యక్తులు కాదు. చేసిన పన్నాగం అంతకుమించిన స్థాయిలో ఉంది. వాళ్ళు ఏకంగా హైడ్రా రంగనాథ్ కే టోపీ పెట్టారు. హైదరాబాద్ నగరంలో ఆక్రమణలు లేకుండా చూడాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా అనే వ్యవస్థను ఏర్పాటు చేసింది.. దీని ద్వారా చెరువులను.. కుంటలను.. నాలాలాను కాపాడే ప్రయత్నం చేస్తోంది. ఈ నేపథ్యంలో హైడ్రా వ్యవస్థ అత్యంత దూకుడుగా పని చేస్తోంది. హైడ్రా కమిషనర్‌గా రంగనాథ్ ఆక్రమణల విషయంలో ఉక్కుపాదం మోపుతున్నారు. ఏ మాత్రం దాన్ని కడుగు వేయకుండా ఆక్రమణలను పడగొడుతున్నారు. చెరువులను కాపాడుతున్నారు. ప్రకృతి వనరులను సంరక్షిస్తున్నారు. హైడ్రా రంగనాథ్ చేస్తున్న మంచి పనులను కొంతమంది జీర్ణించుకోలేకపోతున్నారు.* -ముద్ర, హైదరాబాద్:

## వచ్చే ఏడాది నుంచి ప్లాస్టిక్ కరెన్సీ నోట్లు

03

### పేపర్ నోట్ల కంటే 4 రెట్లు మన్నిక

- పాలిమర్ నోట్లు ముద్రించేందుకు నిర్ణయం
- టెస్టుల తర్వాతే కొత్త నోట్ల విడుదల
- ఆర్బీఐ కీలక ప్రకటన



# కేంద్రం VS మెటా

## ముదురుతున్న మోదీ వీడియో తొలగింపు వివాదం

- కేంద్రం కాళ్ల బేరానికి 'మెటా' ప్రతినిధులు
- మెటా లీగల్ ఇమ్యూనిటీ రద్దుపై కేంద్రం తీవ్ర హెచ్చరికలు
- జుకర్‌బర్గ్‌కు పార్లమెంటరీ కమిటీ అల్టిమేటమ్



**ముద్ర డెస్క్:**
ప్రధాని నరేంద్ర మోదీకి సంబంధించిన వీడియోను ఫేస్‌బుక్ నుంచి తొలగించిన వ్యవహారం దేశవ్యాప్తంగా తీవ్ర రాజకీయ, న్యాయపరమైన చర్చకు దారితీసింది. ఈ అంశంపై మెటా ఇచ్చిన వివరణతో కేంద్ర ప్రభుత్వం, పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సంతృప్తి చెందకపోవడంతో వివాదం మరింత ముదిరింది. ఈ నేపథ్యంలో మెటా సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ మూడు రోజుల్లో బహిరంగ క్షమాపణ చెప్పాలని పార్లమెంటరీ కమిటీ అల్టిమేటమ్ జారీ చేసినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.
అంతేకాకుండా, సోషల్ మీడియా వేదికల్లో మహిళలు, చిన్నారులను అవమానించేలా లేదా చట్టవిరుద్ధంగా ఉన్న కంటెంట్‌ను తక్షణమే తొలగించేలా మెటా చర్యలు తీసుకోవాలని కమిటీ స్పష్టం చేసినట్లు సమాచారం. ఈ సూచనలను పట్టించుకోకపోతే ప్రస్తుతం ఐటీ చట్టం కింద మధ్యవర్తి సంస్థలకు లభిస్తున్న 'సేఫ్ హార్బర్' (Legal Immunity) రక్షణను ఉపసంహరించే అవకాశాన్ని కూడా కేంద్రం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. **మిగతా 02లో**

# ప్రాజెక్టుల రద్దుకు కుట్ర

### రేవంత్ రెడ్డి సర్కార్ మౌనంపై హరీష్ రావు ఆగ్రహం

- సాగునీరుపై ఏపి హక్కులు
- జీఆర్ఎంబీ అజెండానే నిదర్శనం
- తెలంగాణ ప్రాజెక్ట్ అనుమతులు రద్దు కోరడం అన్యాయం
- కాంగ్రెస్ ప్రభుత్వం మౌనం ఎందుకు?
- నీటి హక్కులను తాకట్టు పెడుతున్నారా?
- వెంటనే ఆ అజెండా రద్దు చేయాలని డిమాండ్

02



# సీఎం విదేశీ పర్యటన

03

### ఏసీబీ కోర్టు గ్రీన్ సిగ్నల్



## సంస్మరణ సభకు కేసీఆర్

### 9న నల్లబెల్లిలో పెద్ద సంస్మరణ సభ

03



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 06.08.2026
www.mudranews.in | @mudranews



## భోజనం తర్వాత నడకతో షుగర్ కంట్రోల్



భోజనం చేసిన వెంటనే కాకుండా సుమారు 30 నిమిషాల తర్వాత నడవడం వల్ల రక్తంలో గ్లూకోజ్ ఒక్కసారిగా పెరగకుండా ఉంటుంది. ముఖ్యంగా టైప్-2 డయాబెటిస్ ఉన్నవారికి ఈ అలవాటు ఎంతో మేలు చేస్తుందని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

# రంగనాథ్ సంతకం ఫోర్జరీ

**ముద్ర, హైదరాబాద్:**
నగరంలో ఫైర్ సేఫ్టీ నిబంధనలను ఉల్లంఘిస్తూ హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకాలను ఫోర్జరీ చేసి నకిలీ ఫైర్ ఎన్‌ఓసీలను సమర్పించిన ఘటన సంచలనం సృష్టించింది. ఈ వ్యవహారంలో ఎనిమిది జూనియర్ కాలేజీలపై పోలీసులు కేసులు నమోదు చేయగా,



మరో 60 కాలేజీలకు సంబంధించిన ఫైర్ ఎన్‌ఓసీలను కూడా అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.
తెలంగాణ ప్రభుత్వం నగరంలోని చెరువులు, కుంటలు, నాలాలు తదితర ప్రభుత్వ భూములను పరిరక్షించడంతో పాటు భవన భద్రతా ప్రమాణాల అమలుపై ప్రత్యేక దృష్టి సారిస్తూ హైడ్రా వ్యవస్థను ఏర్పాటు చేసింది. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆధ్వర్యంలో ఆక్రమణల తొలగింపుతో పాటు ఫైర్ సేఫ్టీ నిబంధనల అమలులో కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కొన్ని కార్పొరేట్ జూనియర్ కాలేజీల యాజమాన్యాలు ఫైర్ ఎన్‌ఓసీ కోసం నకిలీ పత్రాలను సృష్టించి, హైడ్రా అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసినట్లు విచారణలో వెలుగులోకి వచ్చింది. ఈ నకిలీ ధ్రువపత్రాలను తెలంగాణ ఇంటర్ బోర్డుకు సమర్పించినట్లు అధికారులు గుర్తించారు.
ఈ వ్యవహారంపై హైడ్రా అదనపు డైరెక్టర్ ఫిర్యాదు మేరకు లేక్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ప్రాథమిక విచారణలో బర్కత్‌పురకు చెందిన హైందవి జూనియర్ కాలేజీ, ఎస్‌ఆర్‌నగర్‌లోని రెసోనెన్స్ జూనియర్ కాలేజీ, మెహదీపట్నంలోని ప్రియాంక జూనియర్ కాలేజీ, విద్యానగర్‌లోని మదర్స్ గర్ల్స్ జూనియర్ కాలేజీ, చాంద్రాయణగుట్టలోని శ్రీ చైతన్య జూనియర్ కాలేజీ, చిక్కడపల్లిలోని న్యూ ఎరా జూనియర్ కాలేజీ, శివరాంపల్లిలోని షాహీన్ జూనియర్ కాలేజీ, తెల్లాపూర్‌లోని వశిష్ఠ జూనియర్ కాలేజీ యాజమాన్యాలపై కేసులు నమోదు చేశారు.
అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించని విద్యాసంస్థలకు అనుమతులు లభించకపోవడంతో కొందరు నిర్వాహకులు ఈ దారికి పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. ఇప్పటికే సంబంధిత కాలేజీల గుర్తింపును రద్దు చేయాలని ఇంటర్మీడియట్ బోర్డుకు నివేదించగా, ఈ వ్యవహారంలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునేందుకు పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. ఇదిలా ఉండగా, నగరంలోని మరో 60 జూనియర్ కాలేజీలకు సంబంధించిన ఫైర్ ఎన్‌ఓసీలను కూడా అధికారులు స్క్రూటినీ చేస్తున్నట్లు సమాచారం. ఫోర్జరీకి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలతో పాటు విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేసే అవకాశాలు ఉన్నాయని అధికార వర్గాలు వెల్లడించాయి.

# డయల్ 100 ప్లేస్‌లో డయల్ 112

(మొదటి పేజీ తరువాయి)

**పోలీస్, ఫైర్, అంబులెన్స్ సేవలు ఒకే కమాండ్‌లో**
ఇప్పటివరకు వేర్వేరుగా పనిచేస్తున్న పోలీస్, అగ్నిమాపక, అంబులెన్స్ సేవలను ఒకే ఇంటిగ్రేటెడ్ ప్లాట్‌ఫామ్‌లోకి తీసుకువచ్చినట్లు డీజీపీ వెల్లడించారు. తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ నుంచే అన్ని సేవలను పర్యవేక్షిస్తూ, అవసరమైన శాఖలతో సమన్వయం చేసి తక్షణ స్పందన అందిస్తామని చెప్పారు. ఈ సమీకరణ వల్ల అత్యవసర పరిస్థితుల్లో స్పందన మరింత వేగవంతం కానుందని వివరించారు.




**డ్రోన్ టెక్నాలజీతో వేగంగా స్పందన**
అత్యవసర సేవలను మరింత సమర్థవంతంగా మార్చేందుకు డ్రోన్ ఆధారిత టెక్నాలజీని కూడా త్వరలో ప్రవేశపెడుతున్నట్లు డీజీపీ ప్రకటించారు. ప్రత్యేక డ్రోన్ టీమ్‌ను ఏర్పాటు చేసి ప్రమాద ప్రాంతాలపై వేగంగా నిఘా పెట్టడం, సహాయక చర్యలను సమన్వయం చేయడం, విపత్తుల సమయంలో ప్రత్యక్ష సమాచారం సేకరించడం వంటి పనుల్లో డ్రోన్లను వినియోగించనున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో డయల్ 112 సేవలు వెర్షన్ 3.0గా ఆధునిక రూపంలో అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.

**టెక్నాలజీ పోలీసింగ్‌కు శ్రీకారం**
సాంప్రదాయ పోలీసింగ్‌తో పాటు టెక్నాలజీ ఆధారిత పోలీసింగ్‌ను రాష్ట్రంలో విస్తృతంగా అమలు చేస్తున్నామని సీవీ ఆనంద్ చెప్పారు. యువ ఐటీ నిపుణులు, ఏఐ టెక్నాలజీలో ప్రావీణ్యం కలిగిన నిపుణులను ఈ వ్యవస్థలో భాగస్వామ్యం చేస్తామని తెలిపారు. కృత్రిమ మేధ (AI) సాయంతో కాల్ విశ్లేషణ, సంఘటనల ప్రాధాన్యత గుర్తింపు, వేగవంతమైన స్పందన వంటి సేవలను మరింత మెరుగుపరుస్తామని వెల్లడించారు.

**డయల్ 100 నుంచి డయల్ 112 వరకు**
2013లో జీవీకే సహకారంతో కొంపల్లిలో ప్రారంభమైన డయల్ 100 సేవలు తెలంగాణ పోలీసింగ్‌లో కీలక పాత్ర పోషించాయని డీజీపీ గుర్తు చేశారు. దేశవ్యాప్తంగా అన్ని అత్యవసర సేవలకు ఒకే నంబర్ ఉండాలన్న కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు తెలంగాణ ప్రభుత్వం సాంకేతికంగా నిరంతర అభివృద్ధి చేస్తూ వచ్చిందని తెలిపారు. రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఆధునిక సాంకేతికతను దశలవారీగా అమలు చేస్తూ ఇప్పుడు డయల్ 112 రూపంలో సమగ్ర అత్యవసర సేవలను ప్రజలకు అందిస్తున్నామని చెప్పారు.

**ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యం**
డయల్ 112 వ్యవస్థతో అత్యవసర పరిస్థితుల్లో స్పందన సమయం తగ్గడమే కాకుండా, ప్రజలకు ఒకే నంబర్ ద్వారా అన్ని సేవలు అందుబాటులోకి రావడం వల్ల సమన్వయం మరింత మెరుగుపడుతుందని అధికారులు పేర్కొంటున్నారు. కాల్ వచ్చిన క్షణాల్లోనే సంబంధిత శాఖలు రంగంలోకి దిగేలా రూపొందించిన ఈ వ్యవస్థ తెలంగాణలో అత్యవసర సేవల రంగంలో కొత్త అధ్యాయానికి నాంది పలికిందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

# మోదీ వ్యూహానికి జెన్-జీ చెక్

(మొదటి పేజీ తరువాయి)

తీసుకురావడం ద్వారా రాజకీయంగా భారీ మైలేజీ పొందాలని కేంద్రం భావించినట్లు సమాచారం. అయితే, డీలిమిటేషన్ వల్ల దక్షిణ భారత రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గే అవకాశం ఉందనే ఆందోళనలు, సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కలుగుతుందనే విమర్శలు ఇప్పటికే బలంగా వినిపిస్తున్నాయి.
ఇదే సమయంలో యువత సోషల్ మీడియా వేదికగా చేపట్టిన ప్రచారం, రోడ్లపై నిరసనలు ప్రతిపక్షాలకు మరింత ఊతమిచ్చాయి. ఇలాంటి పరిస్థితుల్లో రాజ్యాంగ సవరణ బిల్లులను బలవంతంగా ఆమోదింపజేస్తే ప్రజాస్వామ్యంపై ప్రతికూల సందేశం వెళ్తుందనే అభిప్రాయం అధికార వర్గాల్లో వ్యక్తం అవుతున్నట్లు తెలుస్తోంది.



**ప్రత్యేక సమావేశాల వైపు చూపు**
రాజ్యాంగ సవరణ బిల్లులకు మూడింట రెండొంతుల మెజారిటీతో పాటు సభ ప్రశాంతంగా కొనసాగడం కీలకం. ఈ నేపథ్యంలో వర్షాకాల సమావేశాల్లో కాకుండా ఆగస్టు 15 తర్వాత ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలను నిర్వహించి, డీలిమిటేషన్, వన్ నేషన్–వన్ ఎలక్షన్, మహిళా రిజర్వేషన్ల బిల్లులపై మాత్రమే విస్తృత చర్చ జరిపి ఆమోదం పొందే అవకాశాలను కేంద్రం పరిశీలిస్తున్నట్లు సమాచారం.
వర్షాకాల సమావేశాలను రాజకీయంగా కీలక మైలురాయిగా మలచాలన్న కేంద్ర ప్రభుత్వ ప్రణాళికకు జెన్–జీ ఉద్యమాలు, ప్రతిపక్షాల ఐక్య పోరాటం తాత్కాలిక బ్రేక్ వేసినట్లుగా కనిపిస్తోంది. ఇక ప్రత్యేక సమావేశాల్లో కేంద్రం ఎలాంటి వ్యూహంతో ముందుకు సాగుతుందనేది ఆసక్తికర అంశంగా మారింది.

# ప్రాజెక్టుల రద్దుకు కుట్ర

**ముద్ర, హైదరాబాద్:**
గోదావరి నదీ యాజమాన్య బోర్డు (GRMB) సమావేశ అజెండా తెలంగాణ ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కలిగించేలా ఉందని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపించారు. తెలంగాణ ప్రాజెక్టుల విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం



వరుసగా అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నప్పటికీ సీఎం రేవంత్ రెడ్డి స్పందించకపోవడం ఆందోళనకరమని విమర్శించారు.
ఈ నెల 18న జరగనున్న GRMB సమావేశ అజెండాలో ఇప్పటికే కేంద్రం అనుమతులు ఇచ్చిన తెలంగాణలోని ఏడు కీలక ప్రాజెక్టులపై పునఃసమీక్ష ప్రతిపాదనను చేర్చడం వెనుక ఏపీ ప్రభుత్వ కుట్ర ఉందని హరీష్ రావు అన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉంటే ఇలాంటి పరిస్థితి వచ్చేది కాదని, తెలంగాణ ప్రయోజనాలను కాపాడడంలో ప్రస్తుత ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.
తెలంగాణకు సంబంధించిన నీటి హక్కులను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్న ఏపీ ప్రభుత్వానికి కేంద్రం, జీఆర్ఎంబీ సహకరిస్తున్నాయని ఆయన విమర్శించారు. జీఆర్ఎంబీలో తెలంగాణకు చెందిన అధికారులు ఉన్నప్పటికీ ఇలాంటి అజెండాను ఎందుకు అడ్డుకోలేకపోయారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.
కాళేశ్వరం, సీతారామతో పాటు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అనుమతులు పొందిన ప్రాజెక్టులను రద్దు చేయాలని ప్రయత్నించడం తెలంగాణ రైతుల ప్రయోజనాలకు విరుద్ధమని పేర్కొన్నారు. సమ్మక్క–సారక్క సాగర్ ప్రాజెక్టు నీటి కేటాయింపుల అంశంపైనా ప్రభుత్వం స్పష్టమైన వైఖరి వెల్లడించాలని కోరారు. తెలంగాణ ప్రయోజనాల పరిరక్షణపై సీఎం రేవంత్ రెడ్డి మౌనం వీడి రాష్ట్ర ప్రభుత్వ అధికారిక స్టాండ్‌ను వెంటనే ప్రకటించాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.

# కేంద్రం vs మెటా

(మొదటి పేజీ తరువాయి)

సేఫ్ హార్బర్ హోదా కోల్పోతే మెటాకు భారీ న్యాయపరమైన సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, థ్రెడ్స్, మెసెంజర్ వంటి ప్లాట్‌ఫారమ్‌లలో వినియోగదారులు పోస్ట్ చేసే కంటెంట్‌కు పరిమిత బాధ్యత మాత్రమే సంస్థపై ఉంటుంది. అయితే ఆ రక్షణ తొలగితే అభ్యంతరకరమైన లేదా చట్టవిరుద్ధమైన పోస్టులకు మెటానే నేరుగా బాధ్యత వహించాల్సి వస్తుంది. దీంతో సంస్థపై క్రిమినల్ కేసులు నమోదు చేసే అవకాశం కూడా పెరుగుతుందని న్యాయ నిపుణులు భావిస్తున్నారు. ఇప్పటికే తెలంగాణ పోలీసులు నమోదు చేసిన కేసుల దర్యాప్తుకు కూడా ఈ నిర్ణయం ప్రభావం చూపే అవకాశముందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.




ఇదే సమయంలో కేంద్ర సమాచార, సాంకేతిక శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో మెటా ప్రతినిధులు సమావేశం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. వివాదాస్పద అంశంపై సంస్థ వైఖరిని, భవిష్యత్ చర్యలను ఈ సమావేశంలో చర్చించినట్లు సమాచారం. అయితే మెటా ఇచ్చిన వివరణతో పార్లమెంటరీ కమిటీ సంతృప్తి చెందలేదని, జుకర్‌బర్గ్ నుంచి నేరుగా క్షమాపణ రావాల్సిందేనన్న డిమాండ్‌పై ఇప్పటికీ కేంద్రం తన వైఖరిని కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది.
ఈ పరిణామాలు భారత్‌లో సోషల్ మీడియా సంస్థల బాధ్యత, కంటెంట్ నియంత్రణ, లీగల్ ఇమ్యూనిటీ అంశాలపై కీలక చర్చకు దారితీసే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# 8 సెకన్లలోనే నిద్రలోకి



**ముద్ర, న్యూఢిల్లీ:**
ఎన్డీయే నుంచి ఇటీవల రాజ్యసభకు ఎన్నికైన కొత్త ఎంపీలతో ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం పార్లమెంట్ సమావేశాలకు ముందు అల్పాహార సమావేశం నిర్వహించారు. దాదాపు గంటపాటు సాగిన ఈ సమావేశంలో కొత్త ఎంపీలకు పార్లమెంటరీ వ్యవహారాలు, వ్యక్తిగత ప్రవర్తన, ప్రజా ప్రతినిధులుగా పాటించాల్సిన విలువలపై సూచనలు చేశారు. జూన్‌లో జరిగిన రాజ్యసభ ఎన్నికల అనంతరం తొలిసారిగా పార్లమెంటులో అడుగుపెట్టిన ఎంపీలతో పాటు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. సభలో వీలైనంత ఎక్కువ సమయం గడపాలని, 100 శాతం హాజరు ఉండేలా కృషి చేయాలని ప్రధాని సూచించారు. అధికార పక్ష నాయకుల నుంచే కాకుండా ప్రతిపక్ష సభ్యుల నుంచి కూడా విషయాలను నేర్చుకోవాలని ఎంపీలకు హితవు పలికారు.
ఈ సందర్భంగా తన వ్యక్తిగత దినచర్య గురించి అడిగిన ప్రశ్నలకు మోదీ ఆసక్తికర సమాధానాలు ఇచ్చారు. తాను నిద్రకు ఉపక్రమించిన తర్వాత ఎనిమిది సెకన్లలోపే నిద్రపోతానని చెప్పారు. రోజుకు సుమారు 3 గంటలు మాత్రమే నిద్రపోతానని వెల్లడించారు. జీవితంలో ఉత్తమ ఫలితాలు సాధించాలంటే గతం లేదా భవిష్యత్తు గురించి కాకుండా వర్తమానంలో జీవించడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న సమయాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని ఎంపీలకు సూచించారు.
విదేశీ పర్యటనల అనుభవాన్ని కూడా ప్రధాని పంచుకున్నారు. విమానం ఎక్కిన వెంటనే తాను వెళ్లే దేశం కాలమానానికి అనుగుణంగా గడియారాన్ని సర్దుబాటు చేసుకుంటానని, దీంతో కొత్త దేశానికి చేరుకున్న తర్వాత సమయ వ్యత్యాసం వల్ల ఎలాంటి ఇబ్బందులు ఎదురుకావని తెలిపారు.

# అందుబాటులోకి మరో స్టీల్ బ్రిడ్జి

**ముద్ర, హైదరాబాద్:**
హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చేపట్టిన కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులలో భాగమైన సైదాబాద్ స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తయ్యాయని రవాణా, హైదరాబాద్ ఇన్–ఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మంత్రి అజారుద్దీన్‌తో కలిసి నూతనంగా రూపుదిద్దుకున్న సైదాబాద్ స్టీల్ బ్రిడ్జితో పాటు తుది దశకు చేరుకున్న మూసారాంబాగ్ బ్రిడ్జి పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాసన సభ్యులు అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాలా, కాలేరు వెంకటేష్, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ తదితర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.
సుమారు రూ.680 కోట్లతో నిర్మించిన ఈ ఆధునిక స్టీల్ బ్రిడ్జి చంచల్‌గూడ జైలు ప్రాంగణం నుంచి ఓవైసీ ఆస్పత్రి వరకు, అలాగే మరోవైపు చంపాపేట వైపు సులభంగా వెళ్లేలా మెరుగైన కనెక్టివిటీని అందిస్తుంది. అతిత్వరలోనే ఈ వంతెనను సీఎం చేతుల మీదుగా ప్రారంభించి ప్రజలకు అంకితం చేయనున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే సైదాబాద్, సంతోష్‌నగర్, చంచల్‌గూడ, చంపాపేట తదితర ప్రాంతాల ప్రజలకు సుదీర్ఘకాలంగా వేధిస్తున్న ట్రాఫిక్ కష్టాల నుంచి ఉపశమనం లభించడమే కాకుండా ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుంది. మూసారాంబాగ్ వద్ద నిర్మిస్తున్న వంతెన పనులు సైతం చివరి ఘట్టానికి చేరుకున్నాయని, రాకపోకలకు వీలుగా అప్రోచ్ రోడ్ల విస్తరణను వేగవంతం చేశామని తెలిపారు. నగరంలో నానాటికీ పెరుగుతున్న జనాభా, వాహనాల రద్దీకి అనుగుణంగా కేబీఆర్ పార్క్ పరిసరాల్లో చేపట్టిన బ్రిడ్జి పనులతో పాటు పెండింగ్ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారని, ప్రజా రవాణాను మరింత మెరుగుపరచడమే ప్రభుత్వ ప్రాధాన్యమని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.



# కట్టుకథలతో ఆరోపణలు చేయడమే హరీశ్‌రావు పని

**ముద్ర, హైదరాబాద్:** తెలంగాణ ప్రాజెక్టులను ఏపీ ప్రభుత్వం 12 ఏళ్లుగా వ్యతిరేకిస్తోందని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ పరోక్షంగా ఆ రాష్ట్ర ప్రాజెక్టులకు మద్దతిచ్చిందని చెప్పారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్‌రావు తప్పుడు ప్రచారం మానుకోవాలని హితవు పలికారు. ''బీఆర్ఎస్ అధికారంలో ఉన్న ఏ రోజూ రాష్ట్ర ప్రయోజనాలు కాపాడలేదు. అధికారం కోల్పోవడంతో హరీశ్‌రావు ఆరోపణలు చేస్తున్నారు. ఏపీకి అమ్ముడుపోయి ఇప్పుడు విమర్శలు చేస్తున్నారు. కట్టుకథలతో ఆరోపణలు చేయడమే ఆయన పని. తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వకూడదని ఏపీ ప్రతిసారి కోరుతూ వచ్చింది. అనుమతులు వచ్చాక కూడా సమీక్షించాలని ప్రస్తావిస్తూనే ఉంది. నీటి పంపిణీ కోసం ఒప్పందం లేదా ట్రైబ్యునల్ ఏర్పాటు చేయాలని ఆనాడు బీఆర్ఎస్ కోరింది. ఇప్పటి వరకు ట్రైబ్యునల్ ఏర్పడకుండా సమయస్ఫూర్తితో అడ్డుకున్నాం.
సమ్మక్క సాగర్ విషయంలో ఛత్తీస్‌గఢ్‌తో బీఆర్ఎస్ ప్రభుత్వం సంప్రదింపులు జరపలేదు. ఆ రాష్ట్రం నుంచి ఎన్‌వోసీ కోసం మేం ప్రయత్నిస్తున్నాం.. నెలాఖరులో ఇస్తామన్నారు. ఏపీ అభ్యంతరాలను తిప్పికొట్టి సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్‌కు అనుమతులు సాధించాం. పోలవరం–బనకచర్ల ప్రతిపాదనపైనా వెంటనే స్పందించాం. నీటి హక్కులను పరిరక్షించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. కాళేశ్వరం నిర్మాణంలో ఏపీ కాంట్రాక్టర్ల నుంచి ముడుపులు అందాయి. ఈ విషయంలో కవిత ఆరోపణలకు హరీశ్‌రావు జవాబు చెప్పాలి.

# టీటీడీ ట్రస్టులకు రూ.2 కోట్లు విరాళం



**తిరుమల, ముద్ర:**
తిరుపతి తిరుమల దేవస్థానానికి సంబంధించిన ట్రస్టులకు రూ.2 కోట్ల విరాళం అందింది. హైదరాబాద్‌కు చెందిన ట్రినిటీ కంబైన్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ బుధవారం శ్రీ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు రూ.2 కోట్ల విరాళం ప్రకటించింది. ఈ మేరకు సంస్థకు చెందిన ఆర్.సీతారామ్ రెడ్డి, జి.కవిత, త్రినయ్‌రెడ్డి, త్రిభువన్‌రెడ్డి శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో తితిదే అదనపు ఈవో సీహెచ్ వెంకయ్యచౌదరికి విరాళం డీడీలను అందజేశారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
గురువారం 06.08.2026
www.mudranews.in | @mudranews



### హై బీపీ తగ్గించడంలో వాకింగ్ పాత్ర



రోజూ క్రమం తప్పకుండా వేగంగా నడవడం వల్ల రక్తప్రసరణ మెరుగుపడి రక్తపోటు నియంత్రణలోకి రావడానికి అవకాశం ఉంటుంది. ఒత్తిడి కూడా తగ్గడంతో గుండెపై భారం తగ్గి హార్ట్ హెల్త్ మెరుగుపడుతుంది.

# సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన

**ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 10 వరకు నాలుగు దేశాల పర్యటన**
**పెట్టుబడులు, విద్య, నైపుణ్యాభివృద్ధి, క్రీడా భాగస్వామ్యాలపై చర్చలు**
**తెలంగాణకు పెట్టబడులు సేకరణే పర్యటన లక్ష్యం**

**ముద్ర, హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి విదేశీ పర్యటనకు వెళ్లనున్నారు. ఈనెల 17 లేదా 18 అర్ధరాత్రి నుంచి సెప్టెంబరు 10 మధ్య నాలుగు దేశాల్లో పర్యటించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. నాలుగు దేశాల్లోని ప్రముఖ పారిశ్రామికవేత్తలను కలిసి తెలంగాణ లో పెట్టుబడులు పెట్టాలని కోరనున్నారు. యూకే, అమెరికా, జర్మనీ, చైనా దేశాల్లో సీఎం బృందం పర్యటించనుంది. పలువురు పారిశ్రామిక వేత్తలతో సమావేశాలు కానున్నారు. ఫ్యూచర్‌సిటీలో పెట్టుబడులతోపాటు రాష్ట్రంలో విదేశీ యూనివర్సిటీలు, క్రీడలు, శిక్షణా సంస్థల భాగస్వామ్యంపై చర్చించనున్నారు. ఈనెల 16న ప్రత్యేక అసెంబ్లీ సమావేశం నిర్వహించి 21ఏళ్లకే చట్టసభలకు పోటీ చేసే అవకాశం ఉండాలంటూ తీర్మానం చేసే అవకాశం ఉంది.ఆ మరుసటి రోజు విదేశీ పర్యటనకు బయలుదేరే అవకాశముంది. హైదరాబాద్ నుంచి ముందుగా యూకేకు, అక్కడ ఎంఐఎం శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ కూతురు నిఖా కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం సీఎం అమెరికాకు వెళ్లనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కొన్ని విదేశీ విశ్వవిద్యాలయాలు తెలంగాణలో తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేయడానికి ఆసక్తి చూపుతున్న నేపథ్యంలో మరిన్ని ప్రముఖ సంస్థలను రాష్ట్రానికి ఆహ్వానించే ప్రయత్నాలు జరగనున్నాయి. యూకే, అమెరికాలోని ప్రముఖ క్రీడా అకాడమీలు, శిక్షణా



కేంద్రాలను సందర్భించి అక్కడ అమలవుతున్న విధానాలను అధ్యయనం చేయనున్నారు. ఈ పర్యటనలో ముఖ్యమంత్రి సలహాదారు కె.రామకృష్ణారావుతోపాటు పలువురు ఉన్నతాధికారులు కూడా పాల్గొనే అవకాశం ఉంది.

# పెద్ది సంస్మరణ సభకు కేసీఆర్

- **ఈ నెల 9న నల్లబెల్లికి పయనం**
- **పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి పరామర్శ**
- **9, 10 తేదీల్లో దివంగత మాజీ ఎమ్మెల్యే సంస్కరణ సభలు**
- **9న కేటీఆర్, 10న హరీష్ రావు హాజరు**
- **పెద్ద ఎత్తున తరలిరానున్న బీఆర్ఎస్ శ్రేణులు**

**ముద్ర, హైదరాబాద్ :** ఇటీవల దివంగతులైన నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబసభ్యులను బీఆర్ఎస్ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పరామర్శించనున్నారు. ఈ నెల 9న నల్లబెల్లి మండల కేంద్రంలోని పెద్ది నివాసంలో ఆయన భార్య, పిల్లలు, కుటుంబ సభ్యులతో కేసీఆర్ భేటీ అవుతారు. ఇదిలా ఉంటే ఈ నెల 9, 10 తేదీల్లో పెద్ది సుదర్శన్‌రెడ్డి సంస్మరణ సభలు నిర్వహించాలని బీఆర్ఎస్ పార్టీ నిర్ణయించింది. 9న నల్లబెల్లిలో జరిగే సంస్మరణ సభకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతారు. 10న హనుమకొండ జిల్లా కేంద్రంలో జరిగే సంస్మరణ సభకు మాజీ మంత్రి హరీశ్‌రావు హాజరవుతారని బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి. సంస్మరణ సభల నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లపై చర్చించేందుకు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన నేతలు మంగళవారం తెలంగాణ భవన్‌లో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ముదిరాజ్, మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనా చారి, మాజీ





ఎంపీ వినోద్ కుమార్, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, తక్కళ్ళపల్లి రవీందర్ రావు, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన సుమారు 30 మంది ముఖ్య నేతలు ఈ భేటీలో పాల్గొన్నారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి అంత్యక్రియలకు పార్టీలకు అతీతంగా భారీ సంఖ్యలో నేతలు, ప్రజలు తరలివచ్చిన నేపథ్యంలో ఆయన స్వగ్రామంలో జరిగే సంస్మరణ సభ, దశ దినకర్మకు కూడా పెద్ద ఎత్తున జనం వచ్చే అవకాశముందని పార్టీ నేతలు అంచనా వేశారు. ఈ నేపథ్యంలో నల్లబెల్లిలో చేయాల్సిన ఏర్పాట్లపై నేతలు చర్చించారు.

### జవహర్ నగర్ డంపింగ్ యార్డ్‌కు శాశ్వత పరిష్కారం కోరిన ఈటల



**ముద్ర, న్యూఢిల్లీ:** జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ వల్ల లక్షలాది మంది ప్రజలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని, దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ ను కోరారు. రోజుకు సుమారు 10 వేల మెట్రిక్ టన్నుల చెత్త అక్కడకు చేరుతోందని, జీరో పొల్యూషన్ విధానంలో చెత్త నిర్వహణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ తరహా వ్యర్థాల నిర్వహణ విధానాలను హైదరాబాద్‌లో అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చినట్లు ఈటల తెలిపారు.

### 22ఏ భూములపై అర్హులకు అన్యాయం జరగదు: మంత్రి పొంగులేటి



ముద్ర, హైదరాబాద్: రాష్ట్రంలో 22ఏ నిషేధిత జాబితా పేరిట ఏ అర్హుడికీ అన్యాయం జరగదని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగా ఒక్క సెంటు భూమిని కూడా 22ఏ జాబితాలో చేర్చలేదని తెలిపారు. అర్హుల హక్కులను కాపాడడంతో పాటు ప్రభుత్వ భూములను పరిరక్షించడమే ప్రభుత్వ లక్ష్య మన్నారు. 22ఏకు సంబంధించిన దరఖా స్తులు, ఫిర్యాదులను నిర్ణీత గడువు లోనే పరిష్కరించాలని రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. హైకోర్టు నిర్దేశించిన 45 రోజుల గడువులో కేసులను పరిష్కరించి, ప్రజలకు న్యాయం జరిగేలా పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు.

# తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుపై బిగ్ అప్‌డేట్

**కేంద్ర జల్‌శక్తి మంత్రితో సీఎం రేవంత్ భేటీ**
**మహారాష్ట్రతో చర్చించేందుకు చొరవ చూపాలన్న రేవంత్ రెడ్డి**
**150 మీటర్ల ఎత్తులో ప్రాజెక్ట్ నిర్మిస్తామని ప్రతిపాదన**

**ముద్ర, ఢిల్లీ :** ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి ఇవాళ కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ భేటీలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పలువురు ఎంపీలు పాల్గొన్నారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులో అత్యంత కీలకమైన తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణ ఎత్తు విషయమై మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చించేందుకు కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని సీఎం, సీఆర్ పాటిల్‌కు విజ్ఞప్తి చేశారు.

**150 మీటర్ల ఎత్తుతో నిర్మాణం..**

అయితే, గతంలో తుమ్మిడిహెట్టి బ్యారేజీ ని 148 మీటర్ల ఎత్తున నిర్మించేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిన విషయాన్ని సీఎం రేవంత్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. అయితే, తెలంగాణ ప్రయోజనాల దృష్ట్యా దీనిని 150 మీటర్ల ఎత్తుతో నిర్మించేలా మహారాష్ట్రను ఒప్పించాలని ప్రతిపాదించారు. బ్యారేజీ ఎత్తును 150 మీటర్లకు పెంచినా కూడా ముంపు ప్రాంతం 1,000 హెక్టార్ల లోపే ఉంటుందని సీఆర్ పాటిల్‌కు సీఎం స్పష్టం చేశారు.



తుమ్మిడిహెట్టి వద్ద 150 మీటర్ల ఎత్తులో ప్రాజెక్టు నిర్మిస్తే విద్యుత్ వినియోగం, లిఫ్ట్ చేయాల్సన అవసరం లేకుండా కేవలం గ్రావిటీతోనే నిరాటంకంగా నీటిని తరలించే అవకాశం ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి, సీఆర్ పాటిల్‌కు వివరించారు.

అంతకుముందు కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్‌తో సీఎం భేటీ అయ్యారు. తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న పలు నీటిపారుదల ప్రాజెక్టులు, జాతీయ రహదారుల నిర్మాణానికి సంబంధించిన శాఖాపరమైన (ఫారెస్ట్, ఎన్విరాన్‌మెంట్) క్లియరెన్సులను త్వరితగతిన మంజూరు చేయాలని ఈ సందర్భంగా చర్చించారు.

# సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభకు సర్వం సిద్ధం..

**సరూర్‌నగర్‌లో భారీ ఏర్పాట్లు**
**ప్రతిజ్ఞ చేయనున్న కల్వకుంట్ల కవిత, 10 వేల మంది ప్రతినిధులు**

**ముద్ర, హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో గురువారం ఉదయం 10.30 గంటలకు జరగనున్న "సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ"కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సభకు రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 10 వేల మంది ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకానున్నారు. సామాజిక న్యాయ తెలంగాణ సాధన కోసం కవితతో పాటు ప్రతినిధులంతా ప్రత్యేక ప్రతిజ్ఞ చేయనున్నారు.

ఈ సందర్భంగా రాష్ట్రంలోని అన్ని వర్గాల అభివృద్ధి, సాధికారత, సమగ్ర తెలంగాణ నిర్మాణంపై పార్టీ కార్యాచరణను కవిత ప్రకటించనున్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు రాజకీయంగా మరింత ప్రాధాన్యం కల్పించే దిశగా తమ సంకల్పాన్ని వెల్లడించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.సభా ప్రాంగణాన్ని సామాజిక వైతాళికుల స్ఫూర్తిని ప్రతిబింబించేలా ప్రత్యేకంగా అలంకరించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్, ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్, మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే, భాగ్యరెడ్డి వర్మ, చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్, మాన్యశ్రీ కాన్షీరామ్, కొమురం భీమ్, కొండా లక్ష్మణ్ బాపూజీ, కర్పూరి ఠాకూర్ తదితర మహనీయుల చిత్రపటాలను ఏర్పాటు చేశారు. భౌగోళిక తెలంగాణ సాధన అనంతరం సామాజిక న్యాయ తెలంగాణ నిర్మాణమే తదుపరి లక్ష్యమనే సందేశంతో ఈ సభ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రక్షణ సేన పేర్కొంది. ఈ సభ ద్వారా తెలంగాణ రాజకీయాల్లో కొత్త దిశను ఆవిష్కరించే సంకల్పాన్ని ప్రకటించనున్నట్లు పార్టీ నాయకత్వం వెల్లడించింది.



తొలి తరం తెలంగాణ ఉద్యమకారులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో మొదటి దళిత మహిళా ఎమ్మెల్యే, మొదటి మహిళా డిప్యూటీ స్పీకర్ టీఎన్ సదా లక్ష్మి, నిజాం నిరంకుశత్వంపై పోరాడిన బహుజన యోధుడు పండుగ సాయన్న, బహుజన గెరిల్లా యోధుడు వడ్డెర ఓబన్న, బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్, ఉమ్మడి ఏపీ నుంచి లోక్ సభకు ఎన్నికైన మొదటి మహిళా నాయకురాలు, ప్రముఖ స్వతంత్ర సమరయోధులు సంగం లక్ష్మీ బాయి, అక్షర యోధుడు, రజాకర్ల అరాచకాలకు వ్యతిరేకంగా తన కలాన్ని ఎక్కుపెట్టిన వీరుడు షోయబుల్లాఖాన్, మలి దశ తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటానికి ఆద్యుడు, కుల - వర్గ పోరాట సిద్ధాంతకర్త మారోజు వీరన్న, నిజాం పాలనకు వ్యతిరేకంగా ఉద్యమించిన ప్రముఖ కవి, కార్మిక నాయకులు మఖ్దూం మొహియుద్దీన్ ల విగ్రహాలను సభా ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్నారు.

### వచ్చే ఏడాది నుంచి ప్లాస్టిక్ కరెన్సీ నోట్లు..

**ఆర్బీఐ కీలక ప్రకటన**

**ముద్ర, ఢిల్లీ :** దేశంలో పాలిమర్ (ప్లాస్టిక్) కరెన్సీ నోట్లను ప్రవేశపెట్టేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (RBI) సన్నాహాలు ప్రారంభించినట్లు గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడించారు. పాలిమర్ నోట్లను వివిధ వాతావరణ పరిస్థితులు, వినియోగ పరిస్థితుల్లో పరీక్షించనున్నట్లు తెలిపారు. అన్ని పరీక్షలు విజయవంతమై, ప్రణాళిక ప్రకారం పనులు పూర్తయితే 2027 ఏప్రిల్ నుంచి ఈ నోట్లను దశలవారీగా విడుదల చేసే అవకాశం ఉందని చెప్పారు.ప్రపంచంలోని అనేక దేశాల్లో ఇప్పటికే మూడు దశాబ్దాలుగా పాలిమర్ కరెన్సీ నోట్లు చలామణిలో ఉన్నాయని ఆయన గుర్తుచేశారు. సాధారణ పేపర్ నోట్లతో పోలిస్తే పాలిమర్ నోట్లు నాలుగు రెట్లు ఎక్కువ కాలం మన్నికగా ఉండటంతో పాటు నీరు, తేమ, మురికి వంటి వాటికి కూడా ఎక్కువగా తట్టుకుంటాయని వివరించారు. ఈ కొత్త నోట్లతో కరెన్సీ ముద్రణ, నిర్వహణ ఖర్చులు కూడా దీర్ఘకాలంలో తగ్గే అవకాశముందని ఆర్బీఐ భావిస్తోంది.

### కోవిడ్-19పై సింగపూర్ సంచలన అధ్యయనం

**వైరల్ అవుతున్న సందేశం.. నిజమేనా?**

**ముద్ర, ఢిల్లీ :** సింగపూర్ కోవిడ్-19 మృతదేహాలకు ప్రపంచంలోనే తొలిసారిగా పోస్ట్ మార్టం నిర్వహించి, కరోనా వైరస్ కాదని, రేడియేషన్ కు గురైన బ్యాక్టీరియా అని నిర్ధారించిందంటూ సోషల్ మీడియాలో ఓ సందేశం విస్తృతంగా వైరల్ అవుతోంది. అలాగే ఆస్పిరిన్ ఇవ్వడంతో వేలాది మంది రోగులు కోలుకున్నారని కూడా అందులో పేర్కొంటున్నారు. అయితే ఈ వాదనలను అంతర్జాతీయ ఫ్యాక్ట్ చెక్ సంస్థలు, వైద్య నిపుణులు గతంలోనే అసత్యమని స్పష్టం చేశారు. సింగపూర్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ కూడా ఇలాంటి ప్రకటన ఏదీ విడుదల చేయలేదు. కోవిడ్-19 ఒక వైరల్ వ్యాధేనని, చికిత్స కోసం వైద్యుల సూచనలనే అనుసరించాలని నిపుణులు సూచిస్తున్నారు.

### హైదరాబాద్‌లో విజయవంతంగా ముగిసిన రెండో బ్రిక్స్ అవినీతి నిరోధక కార్యబృంద సమావేశం

**ముద్ర, హైదరాబాద్ :** హైదరాబాద్‌లో కేంద్ర సిబ్బంది, శిక్షణ శాఖ (డీవోపీటీ) ఆధ్వర్యంలో నిర్వహించిన రెండో బ్రిక్స్ అవినీతి నిరోధక కార్యబృంద సమావేశం, ఆస్తుల పునరుద్ధరణపై బ్రిక్స్ నిపుణుల నెట్‌వర్క్ సమావేశం విజయవంతంగా ముగిశాయి. ఆగస్టు 4, 5 తేదీల్లో జరిగిన ఈ సమావేశాల్లో బ్రిక్స్ సభ్య దేశాల ప్రతినిధులు పాల్గొని అవినీతి నిరోధం, పరారీలో ఉన్న నేరస్తుల అప్పగింత, ఆస్తుల రికవరీ, సాంకేతికత ఆధారిత పారదర్శక పాలన, ఫిన్‌టెక్ మరియు వర్చువల్ డిజిటల్ ఆస్తుల దుర్వినియోగ నియంత్రణ వంటి అంశాలపై చర్చించారు. బ్రిక్స్ దేశాల మధ్య అవినీతి నిరోధక సహకారాన్ని మరింత బలోపేతం చేయాలనే సంకల్పాన్ని సమావేశం పునరుద్ఘాటించింది.

### జూరాల ప్రాజెక్టుకు భారీ వరద ప్రవాహం

**ముద్ర న్యూస్, మహబూబ్ నగర్ :** ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జూరాల ప్రాజెక్టుకు వరద ఉధృతి కొనసాగుతోంది. ప్రాజెక్టుకు 2.44 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదుకాగా, వరద ప్రవాహం పెరగడంతో అధికారులు 33 గేట్లను ఎత్తివేశారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 7.40 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జూరాల నుంచి 2,51,836 క్యూసెక్కుల నీటిని శ్రీశైలం జలాశయానికి విడుదల చేస్తున్నారు. భీమా నదిపై ఉన్న ఉజ్జని జలాశయానికి 1.20 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. అలాగే ఆల్మట్టి నుంచి 1.50 లక్షల క్యూసెక్కులు, నారాయణపూర్ నుంచి 1,45,400 క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగుతోంది. కాగా, శ్రీశైలం జలాశయం నుంచి నాగార్జునసాగర్‌కు ప్రస్తుతం ఎలాంటి నీటి విడుదల లేదు.

### ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా విశాఖ ఎకనమిక్ రీజియన్ అభివృద్ధి

**- సీఎం చంద్రబాబు**

**ముద్ర, అమరావతి:** విశాఖ ఎకనమిక్ రీజియన్ (వీఈఆర్) అభివృద్ధిని ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, సమగ్రంగా చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. వీఈఆర్ పరిధిలోని అన్ని ప్రాంతాలు, అన్ని రంగాలను కలుపుకొని సూక్ష్మ స్థాయి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఈ ప్రణాళికల రూపకల్పనలో ఆంధ్రా యూనివర్శిటీ సేవలను వినియోగించుకోవాలని పేర్కొన్నారు.విశాఖ బే సిటీని యాంకర్ ప్రాజెక్టుగా అభివృద్ధి చేయడంతో పాటు, ఈస్ట్-వెస్ట్ కనెక్టివిటీ, రోడ్-రైల్ అనుసంధానం, నాలుగు విమానాశ్రయాలు, మూడు పోర్టులను కలిపే మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఎం సూచించారు.



సీఆర్‌జెడ్ నిబంధనలకు అనుగుణంగా పరిశ్రమలు, టూరిజం, టౌన్‌షిప్‌లు, పీపీపీ ప్రాజెక్టులను అభివృద్ధి చేసి భారీ పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు సృష్టించాలని తెలిపారు. అలాగే స్థానిక యువతకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించి, అభివృద్ధి వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు నిరంతరం తెలియజేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

### 23వ తేదీ అర్ధరాత్రి నుంచి ఆటో డ్రైవర్ల నిరవధిక సమ్మె

**ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి : ఆటో జెఏసి**



**ముద్ర, హైదరాబాద్ :** రాష్ట్రంలోని ఆటో, క్యాబ్, లారీ, బస్సు తదితర వాహనాల డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఆటో, యాప్ ఆధారిత సంఘాల జేఏసీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే అమలు చేయకపోతే ఈ నెల 23వ తేదీ అర్ధరాత్రి నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆటో డ్రైవర్లు నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించింది.హైదరాబాద్‌లో జరిగిన జేఏసీ రౌండ్‌టేబుల్ సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ డ్రైవర్లకు ఆరోగ్య బీమా, ప్రమాద బీమా, పెన్షన్ వంటి సామాజిక భద్రతా పథకాలు అమలు చేయాలని కోరారు. పెరుగుతున్న ఇంధన ధరలు, నిర్వహణ వ్యయాలను దృష్టిలో ఉంచుకుని ఆటో మీటర్ చార్జీలను తక్షణమే సవరించాలని, ఓలా, ఉబెర్‌కు ప్రత్యామ్నాయంగా రాష్ట్ర ప్రభుత్వమే ప్రత్యేక మొబైల్ యాప్‌ను అభివృద్ధి చేయాలని సూచించారు. ప్రభుత్వం త్వరగా స్పందించకపోతే అసెంబ్లీ సమావేశాల సమయంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని, ఆగస్టు 15 తర్వాత రాష్ట్రవ్యాప్తంగా ఆటో డ్రైవర్ల మహాసభ నిర్వహించి తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని జేఏసీ స్పష్టం చేసింది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
గురువారం 06.08.2026
4 వేదిక Peoples Voice
మీ 'ముద్ర' వేయండి
నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..
మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

## ఒక డ్యాం..

# కోటి ఆశలు

### ఆసియాలోనే అతిపెద్ద మట్టి డ్యాం

### నాగార్జునసాగర్ ప్రారంభోత్సవం వెనుక కథ

ఆ రోజు తెలుగు నేల చరిత్రలో స్వర్ణ అక్షరాలతో లిఖించబడిన రోజు. ఆసియాలోనే అతి పెద్ద మట్టి డ్యాంగా గుర్తింపు పొందిన నాగార్జునసాగర్ ప్రాజెక్టు జాతికి అంకితమైన రోజు.

**ప్రారంభోత్సవం - ఒక చారిత్రక ఘట్టం**

భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ 1955 డిసెంబర్ 10న దీనికి శంకుస్థాపన చేశారు. దాదాపు 11 సంవత్సరాల కృషి తర్వాత, 1966 ఆగస్టు 4న అప్పటి ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధీ చేతుల మీదుగా ఈ మహా ప్రాజెక్టును జాతికి అంకితం చేశారు. ఆ కార్యక్రమానికి అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, వేలాది రైతులు, కార్మికులు హాజరయ్యారు. డ్యాం పై నుంచి నీరు కిందికి వదిలిన క్షణం.. "కృష్ణమ్మ పొంగింది" అంటూ చప్పట్లు, జేజేలు మిన్నంటాయి.



**ఎందుకు అంత ప్రత్యేకం?**

**నిడివి:** 1.6 కి.మీ పొడవు, 124 మీటర్ల ఎత్తుతో అప్పట్లో ప్రపంచంలోనే అతిపెద్ద మట్టి డ్యాం
**సామర్థ్యం:** 312 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం
**ఆయకట్టు:** రెండు తెలుగు రాష్ట్రాల్లో 10 లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టుకు సాగునీరు, తాగునీరు అందించే లక్ష్యం
**విద్యుత్:** 815.6 మెగావాట్ల జలవిద్యుత్ ఉత్పత్తి

**పేరు వెనుక కథ**

ఈ ప్రాంతంలో క్రీస్తు పూర్వం 3వ శతాబ్దంలో వర్ధిల్లిన బౌద్ధ విశ్వవిద్యాలయం "నాగార్జున విద్యాపీఠం" పేరు మీదుగానే ఈ డ్యాంకు "నాగార్జునసాగర్" అని పేరు పెట్టారు. డ్యాం నిర్మాణం కోసం మునిగిపోయిన ఆ ప్రాచీన నగర శిథిలాలను పరిరక్షించి నాగార్జునకొండ ద్వీపంగా తీర్చిద్దారు.

**లక్షల మంది కల**

నెహ్రూ గారు శంకుస్థాపన సభలో చెప్పిన మాటలు ఇప్పటికీ గుర్తు: "ఇది ఆధునిక దేవాలయం. ఇక్కడ మానవుడు ప్రకృతిని జయించి, లక్షలాది మంది ఆకలి తీర్చుతాడు".

ఆ మాట నిజం చేస్తూ నాగార్జునసాగర్ నేడు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రైతాంగానికి జీవనాడిగా మారింది. కరువు ప్రాంతమైన పల్నాడు, గుంటూరు, నల్గొండ, ఖమ్మం జిల్లాల రూపురేఖలే మార్చేసింది.

**ఇప్పటికీ సజీవం**

57 సంవత్సరాలు గడిచినా నాగార్జునసాగర్ "భారతదేశ ఇంజనీరింగ్ అద్భుతం" గా నిలుస్తోంది. ప్రతి ఏడాది లక్షల మంది పర్యాటకులు, విద్యార్థులు ఈ డ్యాంను చూసి స్ఫూర్తి పొందుతున్నారు.

ఆగస్టు 4 అంటే నేటికీ రైతులకు పండుగ. ఎందుకంటే ఆ రోజే వాళ్ల పొలాలకు "కృష్ణమ్మ" కాళ్లకు పూజలు చేసే రోజు మొదలైంది.

# కోడికి ముందే తెల్లారుతుందా?

ఉదయం లేవాలంటే అలారం పెట్టుకోవాలి. ఏ అవసరం ఉన్నా సరే మేల్కోవాలి. దీనికి అలారం ఉండాలి. ఇప్పుడు స్మార్ట్ ఫోన్ లు వచ్చాయి. కొన్ని రోజుల క్రితం అలారాలు ఉండేవి. మరి అంతకంటే ముందు ఏం ఉండేవి? మరి అప్పటి ప్రజలు ఎలా సమయానికి మేల్కొనేవారు? ఇదంతా ఆలోచిస్తే వామ్మో అప్పటి మనుషులు ఇలా ఫోన్ లేకుండా ఎలా జీవించారు అని ఇప్పటి వారికి అనిపిస్తుంది. కానీ ఆ కాలం ఎంత మధురమైన జ్ఞాపకాలను అందించింది కదా. ఇప్పటి వారికి చాలా మందికి జస్ట్ ఫోన్, సోషల్ మీడియా. కానీ అప్పుడు అంతా ప్రాక్టికల్. ఒక దగ్గర కూర్చోవడం లేదు.



బాల్యం గురించి టాపిక్ వస్తే చాలండీ. ఏదో చెప్పాలి అనుకునే నేను. ఏదో చెప్పేస్తుంటాను. ఈ రోజు మీతో అప్పటి ప్రజలు ఎలా తెల్లవారు జామునే లేచేవారు అనే టాపిక్ మాట్లాడాలి అనుకుంటున్న. అయితే అప్పుడు కోళ్లు నిద్ర లేపేవి. ఇప్పటి అలారం ఆపేసి పడుకోవచ్చు. కానీ అప్పటి కోడి కూస్తూనే ఉండేది. కొందరికి ఉదయం లేవడం బద్ధకం అనిపిస్తే నీ కోన్ని కొయ్య ఏం ఒర్రుతుంది అని దుప్పటి నిండా కప్పుకొని పడుకునే వారు. కానీ కొందరు అమ్మో ఇంత పొద్దెక్కిందా అంటూ నిద్ర లేచి ఫాస్ట్ గా పని చేసుకునే వారు.
మరి ఈ కోడి ఎలా కరెక్ట్ సమయానికి నిద్ర లేస్తుంది? అందరిని నిద్ర లేపింది అనే విషయం మీద మీకు ఎప్పుడైనా అనుమానం వచ్చిందా? ఇప్పటికీ కూడా ఊరిలో కోళ్లు సూర్యోదయానికి ముందే నిద్ర లేచి మిగిలిన అందరినీ నిద్ర లేపుతుంటాయి. మరి దీని వెనుక రహస్యం ఏంటంటే? ప్రతి రోజు అవి అంత నిక్కచ్చిగా సరైన సమయానికి కూయడానికి కారణం ఉంది. వాటికి ముందే టైం తెలుస్తుందట. నిజమే మీరు చదివింది. మనకంటే 45 నిమిషాల ముందే వెలుతురును చూస్తాయి అంటున్నారు శాస్త్రవేత్తలు.

---

## ఒక రోజు ఆసుపత్రిలో..

**డాక్టర్.. మా 12 ఏళ్ల అమ్మాయికి గొంతు నొప్పి ఉంది**
డాక్టర్ పరీక్షించి, అవసరమైన పరీక్షలు చేయాలని సూచిస్తారు. ప్రతి గొంతు నొప్పి క్యాన్సర్ కాదు. కానీ నేటి కాలంలో చిన్న వయసులోనే అనేక ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. అందుకు ఆహారపు అలవాట్లు, కాలుష్యం, జీవనశైలి, వ్యాయామం లేకపోవడం వంటి అనేక కారణాలు ఉన్నాయి.

**డాక్టర్.. మా 21 ఏళ్ల అబ్బాయికి కడుపు నొప్పి**
అధిక మద్యం, పొగాకు, కలుషిత ఆహారం, అధికంగా ప్రాసెస్ చేసిన ఆహారం, వ్యాయామం లేకపోవడం వంటి కారణాలు కాలేయం సహా అనేక అవయవాలపై ప్రభావం చూపుతాయి.

**డాక్టర్.. నా వయసు 35. నాకు గుండె నొప్పి**
ఈ రోజుల్లో గుండె జబ్బులు వృద్ధులకే కాదు, యువతలో కూడా కనిపిస్తున్నాయి. కారణాలు – అధిక కొవ్వు ఉన్న ఆహారం, ఊబ కాయం, ఒత్తిడి, వ్యాయామం లేకపోవడం, ధూమపానం, మధుమేహం, రక్తపోటు.

**డాక్టర్.. నా భార్యకు తల తిరుగుతుంది, కాళ్లు నొప్పిగా ఉన్నాయి**
పరీక్షలు చేస్తే మధుమేహం, రక్తపోటు, రక్తహీనత, విటమిన్ లోపాలు వంటి సమస్యలు కనిపించవచ్చు. ఇవి సరైన ఆహారం, జీవనశైలి, వైద్య చికిత్సతో నియంత్రించవచ్చు.

**డాక్టర్.. మా బిడ్డకు బోర్డు కనిపించడం లేదు**
కంటి సమస్యలు కూడా పెరుగుతున్నాయి. ఎక్కువ సమయం మొబైల్, టీవీ, కంప్యూటర్ ముందు గడపడం, సరైన పోషకాహారం తీసుకోకపోవడం వంటి కారణాలు కూడా ప్రభావం చూపుతాయి.

**ఇలా చూస్తే..**
ప్రతి కుటుంబంలో ఏదో ఒక ఆరోగ్య సమస్య కనిపిస్తోంది. చాలా కుటుంబాల్లో సంపాదనలో పెద్ద భాగం వైద్య ఖర్చులకే వెళ్తోంది.

**అందుకే..**
ఆరోగ్యకరమైన ఆహారాన్ని మన జీవన విధానంలో భాగం చేసుకుందాం.

# ఆహారంతో ఆరోగ్యం

### సేంద్రీయ వ్యవసాయం – ఆరోగ్యకరమైన భావితరాలకు పునాది





★ సాధ్యమైనంత వరకు సేంద్రీయ లేదా తక్కువ రసాయనాలతో పండించిన ఆహారాన్ని ప్రోత్సహిద్దాం.
★ రైతులు ఎరువులు, పురుగుమందులు శాస్త్రీయ సిఫార్సుల మేరకు మాత్రమే వాడాలి.
★ ముడి బియ్యం, జొన్నలు, రాగులు, సజ్జలు, గోధుమలు వంటి చిరుధాన్యాలు ఎక్కువగా తీసుకుందాం.
★ వేరుశెనగ నూనె వంటి సంప్రదాయ నూనెలను మితంగా వాడుదాం.
★ మన ప్రాంతంలో లభించే రేగు, నేరేడు, ఉసిరి, చింతకాయ వంటి స్థానిక పండ్లను పిల్లలకు అలవాటు చేద్దాం.
★ కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు ప్రతిరోజూ తినేలా చూసుకుందాం.
★ భోజనం చేసేటప్పుడు మొబైల్ ఫోన్‌కు దూరంగా ఉండే అలవాటు నేర్పుదాం.
★ ప్రతిరోజూ వ్యాయామం, నడక, తగిన నిద్రకు ప్రాధాన్యం ఇవ్వుదాం.
★ మద్యం, పొగాకు వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండుదాం.

**"ఎంతకాలం బతికామనేది కాదు... ఎంత కాలం ఆరోగ్యంగా బతికామనేదే ముఖ్యం."**

రైతులారా... సేంద్రీయ వ్యవసాయం, సమతుల్య ఎరువుల వినియోగం వైపు అడుగులు వేయండి.

ప్రజలారా... ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఎంచుకోండి.

మన పిల్లలకు ఆస్తులు మాత్రమే కాదు... ఆరోగ్యాన్ని కూడా వారసత్వంగా అందిద్దాం.



# పిల్లలు.. డబ్బు..

### ఈ విషయాల్లో జాగ్రత్త..



స్మార్ట్ మొబైల్ అందుబాటులోకి వచ్చిన తర్వాత పిల్లల్లో సృజనాత్మకత పెరిగిపోతుంది. ఇలాంటి సమయంలో వారు కొత్త కొత్త వస్తువుల గురించి తెలుసుకుంటున్నారు. అయితే ప్రపంచంలో ఉన్న వస్తువులను పిల్లలు చూసి వాటిని కూడా పొందాలని అనుకుంటూ ఉంటారు. ఇలాంటి సమయంలో వారి తల్లిదండ్రులను అలాంటి వస్తువులు కావాలని ఫోర్స్ చేస్తుంటారు. కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలు అడిగింది ఇవ్వాలన్న ఉద్దేశంతో వారు అడిగిన ప్రతి వస్తువును కొనుగోలు చేస్తుంటారు.
కానీ ఇలా చేయడం ఎంత మాత్రం మంచిది కాదని ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు సూచిస్తున్నారు. అలా అడిగిన ప్రతి వస్తువు కొని స్తే వారి జీవితంలో అనేక మార్పులు వస్తాయని.. ఇవి కష్టాలతో కూడుకొని ఉంటాయ ని హెచ్చరించారు. అసలు పిల్లలను ఎలా పెంచాలి?
ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు ఇటీవల పిల్లల విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇందులో భాగంగా పిల్లలు అడిగిన వెంటనే వస్తువు కొనిచ్చే అలవాటును మానుకోవాలి. ఎందుకంటే వారు అడిగిన ప్రతి వస్తువును కొనివ్వడం వల్ల వారికి కష్టం విలువ తెలియకుండా ఉంటుంది. కొన్నిసార్లు వారు అడిగే వస్తువులు తక్కువ ఖర్చుతో కూడుకొని ఉన్నా.. ఆ తర్వాత ఖరీదైన వస్తువుల విషయంలో కూడా మారం చేసే అవకాశం ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఒక్కోసారి అప్పులు చేయాల్సిన అవసరం ఏర్పడుతుంది. అయితే కొంతమంది తల్లిదండ్రులు తమ పిల్లల సంతోషం కోసం అప్పులు చేసి మరి విలాసవంతమైన వస్తువులు కొనుగోలు చేస్తున్నారు. ఇలా చేస్తే పిల్లల భవిష్యత్తు నాశనం అయ్యే ప్రమాదం ఉంది.
పిల్లలకు చిన్నప్పటి నుంచే డబ్బు విలువ గురించి తెలియజెప్పాలి. వారికి సాదాసీదా జీవితానికి అలవాటు చేయాలి. కష్టపడకుండా ఏదీ రాదని.. కష్టపడితేనే ప్రతి వస్తువును పొందే అవకాశం ఉంటుందని తెలియజెప్పాలి. కొన్ని అత్యవసర వస్తువులను అడిగిన వెంటనే కొనివ్వవచ్చు.. కానీ విలాస వస్తువుల విషయంలో మాత్రం ఆలస్యం చేయడమే మంచిదని అంటున్నారు. ఎందుకంటే విలాసవంతమైన వస్తువులు కొనుగోలు చేయడానికి ఎంతో కష్టమైన పని అని పిల్లలకు చెప్పాలి. ఇలా చెప్పడం వల్ల వారు కూడా విలాసవంతమైన వస్తువుల విషయంలో ఆలోచిస్తారు.

చాలా వరకు తల్లిదండ్రుల జీవన విధానమే పిల్లల జీవితంపై ఎక్కువ ప్రభావం చూపు తుంది. అందువల్ల తల్లిదండ్రులు కూడా కొన్ని ఖరీదైన వస్తువులను పిల్లల ముందు కొనుగోలు చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అంతేకాకుండా వారికి డబ్బు ముఖ్యం కాకుండా క్రమశిక్షణ కూడా చాలా అవసరం అని చెబుతూ ఉండాలి. ఎప్పుడైనా డబ్బు కష్టాలు ఎదురైనప్పుడు వాటి నుంచి త ట్టుకుని సామర్థ్యాన్ని నేర్పించాలి. ఇలా చేయడం వల్ల వారికి ఆర్థిక క్రమశిక్షణ ఏర్పడుతుంది.

# బిజినెస్ లో 90 శాతం భారతీయులు ఫెయిల్ ఎందుకు?

ఉద్యోగం చేయడం కంటే సొంతంగా వ్యాపారం చేయడం ఎంతో బెటర్ అని చాలా మంది భావన. దీంతో మన దేశంలో ప్రతి రోజూ వేల సంఖ్యలో కొత్త వ్యాపారాలు పుట్టుకొస్తున్నాయి. అయితే వాటిలో కొన్ని మాత్రమే విజయవంతంగా రన్ అవుతున్నాయి. మరికొన్ని మధ్యలోనే ఆగిపోవడం లేక తొలగించడం జరుగుతుంది. ఇలా కావడానికి అనేక కారణాలు ఉండవచ్చు. కానీ ఒక వ్యాపారం విజయవంతం కావాలంటే కస్టమర్స్ తో సరైన అవగాహన ఉండడం చాలా అవసరం. ఇలా ఉండాలంటే ఒక ప్లాట్‌ఫామ్ ను ఏర్పాటు చేసుకోవాలి. అది ఒక వెబ్సైట్ అయితే మరింత ఉపయోగకరంగా ఉంటుంది. ఈ వెబ్సైట్ తయారు చేయడానికి ఒకప్పుడు రూ. 50,000 వరకు ఖర్చు అయ్యేది. కానీ ఇప్పుడు ఎలాంటి ఖర్చు లేకుండా ఏఐ టూల్ ద్వారా తయారు చేసుకోవచ్చు. అది ఎలాగో ఇప్పుడు చూద్దాం..
వెబ్సైట్ అనేది ఒక వ్యాపారానికి డిజిటల్ అడ్రస్‌లా పనిచేస్తుంది. ఇందులో సంస్థ వివరాలు, ఉత్పత్తులు లేదా సేవలు, ధరలు, సంప్రదింపు వివరాలు, కస్టమర్ ఫీడ్‌బ్యాక్ వంటి సమాచారాన్ని ఒకే చోట అందుబాటులో ఉంచవచ్చు. దీంతో కస్టమర్లు ఎప్పుడైనా, ఎక్కడి నుంచైనా ఆ వ్యాపారం గురించి తెలుసుకునే అవకాశం ఉంటుంది. ఇది వ్యాపార విశ్వసనీయతను పెంచుతుంది.
గతంలో ఒక ప్రొఫెషనల్ వెబ్‌సైట్ తయారు చేయించుకోవాలంటే రూ.5 వేల నుంచి రూ.50 వేల వరకు లేదా అంతకంటే ఎక్కువ ఖర్చు అయ్యేది. కానీఇప్పుడు Emergent AI అనే టూల్ ద్వారా ఎలాంటి కోడింగ్ పరిజ్ఞానం లేకుండానే వెబ్‌సైట్‌తో పాటు మొబైల్ యాప్‌ను రూపొందించుకోవచ్చు. వినియోగదారుడి తన అవసరాన్ని సాధారణ భాషలో ప్రాంప్ట్ రూపంలో ఇవ్వగానే వెబ్‌సైట్ లేదా యాప్‌ను రూపొందిస్తుంది.
ఉదాహరణకు ఒక దుస్తుల షాప్ కోసం ఆన్‌లైన్ వెబ్‌సైట్ కావాలి. లేదా రెస్టారెంట్ కోసం ఫుడ్ ఆర్డర్ వెబ్‌సైట్ రూపొందించు. అనే ప్రాంప్ట్ ఇవ్వగానే డిజైన్, పేజీలు, ఫారమ్‌లు, సంప్రదింపు వివరాలు, ఇతర ఫీచర్లతో కూడిన వెబ్‌సైట్‌ను సిద్ధం చేస్తుంది.

అయితే వెబ్‌సైట్ రూపొందించుకోవడం మా త్రమే కాదు.. అందులో సరైన సమాచారం, నాణ్యమైన ఫోటోలు, క్రమం తప్పకుండా అప్డేట్లు, వేగవంతమైన కస్టమర్ స్పందన ఉంటేనే ఆశించిన ఫలితాలు వస్తాయి.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 06.08.2026
www.mudranews.in | @mudranews



### బరువు తగ్గితే మూడు సమస్యలకు చెక్



3-3-3 వాకింగ్ టెక్నిక్‌ను ఆరోగ్య కరమైన ఆహారంతో కలిపి పాటిస్తే బరువు నియంత్రణలో ఉంటుంది. అధిక బరువు తగ్గడం ద్వారా హై బీపీ, షుగర్, కొలెస్ట్రాల్ వంటి సమస్యలు కూడా క్రమంగా అదుపులోకి వచ్చే అవకాశం ఉంది.

# ఆర్డీవో స్థాయిలో ప్రజావాణి అవసరం లేదు

- మండలం, జిల్లా, రాష్ట్ర స్థాయి ప్రజావాణిలు చాలు
- రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్, ప్రజావాణి ఇంచార్జ్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి



**ముద్ర, హైదరాబాద్:**

రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ (ఆర్డీవో) స్థాయిలో ప్రజావాణి నిర్వహణ అవసరం లేదని, మండలం, జిల్లా, రాష్ట్రస్థాయి ప్రజావాణిలు మాత్రమే ఉండాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్, ప్రజావాణి ఇంచార్జ్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి అభిప్రాయపడ్డారు. ఇది తన వ్యక్తిగత అభిప్రాయం అని ఆయన ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

ఆర్డీవో కార్యాలయాలు దాదాపుగా కలెక్టరేట్ లోనే ఉంటాయని, లేదంటే చుట్టుపక్కల ఉంటాయని, అలాంటప్పుడు మండలం, జిల్లాస్థాయి ప్రజావాణిల మధ్యలో ఆర్డీవో స్థాయిలో ప్రజావాణి నిర్వహణ అవసరం లేదని చిన్నారెడ్డి పేర్కొన్నారు.

ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్లానింగ్ శాఖ ఉన్నతాధికారులు పునరాలోచన చేసి దిద్దుబాటు చర్యలు చేపట్టాలని చిన్నారెడ్డి సూచించారు.



## బోనాల సందర్భంగా భక్తులకు ఇబ్బంది కలిగితే ఊరుకునేది లేదు

**రాజేంద్రనగర్, ముద్ర ప్రతినిధి:**

బోనాల సందర్భంగా అటు ఆడపడుచులకు కానీ, ఇటు భక్తులకు కానీ ఎలాంటి ఇబ్బందులు కలిగిన ఊరుకునేది లేదని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ అన్నారు. లంగర్ హౌస్ ఆలయాల వద్ద, బస్తీలలో నెలకొని ఉన్న సమస్యలను వివరిస్తూ బుజిలీ మహంకాళి ఆలయ చైర్మన్ భోగి బాల్ రాజ్ బుధవారం ఎమ్మెల్యే కౌసర్ ను ఆయన కార్యాలయంలో కలిశారు. ఆలయాల వద్ద, బస్తీల్లో గుంతల మయంగా రోడ్లు, పొంగిపొర్లుతున్న మురుగునీరు, వేలాడుతున్న విద్యుత్ తీగలు, పేరుకుపోయిన చెత్త పలు సమస్యలను ఫోటోలు వీడియోలతో పాటు ఎమ్మెల్యేకు చూపించారు. స్పందించిన ఎమ్మెల్యే కౌసర్ వెంటనే వివిధ శాఖల అధికారులను తన కార్యాలయానికి పిలిపించారు. అందరి ముందు సమస్యల విషయం చర్చించారు. అన్ని శాఖల అధికారులు స్పందించి వెంటనే సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ముఖ్యంగా బోనాలు తీసుకువెళ్లే సమయంలో గుంతలు, మురుగు వల్ల అనేక ఇబ్బందులు పడతారని, ఎంతో పవిత్రంగా ఆలయాలకు వెళ్లే సందర్భంగా ఇలాంటి సమస్యలతో భక్తులకు ఇబ్బందులు కలగవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో వరదరాజ్, రాజేష్ లతోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## శేరిలింగంపల్లి 92 దేవాలయాలకు రూ.30.71 లక్షలు మంజూరు

- బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది
- పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ



**ముద్ర, శేరిలింగంపల్లి:**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ మాస బోనాల పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ ప్రభుత్వం శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని 92 దేవాలయాలకు రూ.30,71,000 ఆర్థిక సహాయాన్ని మంజూరు చేసింది. ఈ నిధులను గౌరవ పీఏసీ చైర్మన్ శ్రీ ఆరెకపూడి గాంధీ ఆలయ ధర్మకర్తలకు అందజేశారు.

ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఈఓ శ్రీ సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్లు శ్రీ దొడ్ల వెంకటేష్ గౌడ్, శ్రీ ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకులు శ్రీ రఘునాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ తెలంగాణ ప్రజలందరికీ బోనాల పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ఆత్మగౌరవానికి, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే బోనాల మహోత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్నివిధాలా సహకరిస్తోందని పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని మతాలను సమానంగా గౌరవిస్తూ ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా బోనాల ఉత్సవాల నిర్వహణ కోసం రూ.20 కోట్ల నిధులను మంజూరు చేయడం అభినందనీయమని అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని 92 దేవాలయాలకు రూ.30.71 లక్షల నిధులు మంజూరు కావడం ఆనందదాయకమని తెలిపారు. బోనాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, వైద్య సేవలు తదితర అన్ని సౌకర్యాలను సమన్వయంతో ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ప్రతి భక్తుడు అమ్మవారి ఆశీస్సులతో ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో బోనాల ఉత్సవాలను జరుపుకునేలా అన్ని శాఖలు సమిష్టిగా పనిచేయాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. బోనాల ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అందిస్తున్న నిధులు ఎంతో ఉపయోగపడతాయని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని ఆరెకపూడి గాంధీ వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ఆలయ ధర్మకర్తలు మరియు భక్తులు పాల్గొన్నారు.

## జంతర్ మంతర్ నిరసనల సందర్భంగా ఉగ్ర కుట్ర భగ్నం.. 9 మంది అరెస్ట్

**ముద్ర, ఢిల్లీ:** జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసనల సందర్భంగా ఉగ్ర కుట్రను భగ్నం చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ కేసులో నలుగురు మైనర్లతో పాటు మొత్తం తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

అరెస్టయిన వారి వద్ద నుంచి మూడు తుపాకులు, నాలుగు పెట్రోల్ బాంబులను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. ప్రాథమిక విచారణలో వీరు ఉగ్రవాద సంస్థ ఐఎస్ఐ ఆదేశాల మేరకు పనిచేస్తున్నట్లు అనుమానిస్తున్నామని, ఆ కోణంలో దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు పేర్కొన్నారు. అరెస్టయిన వారిలో ఎనిమిది మంది జంతర్ మంతర్‌లో జరిగిన నిరసనల్లో పాల్గొన్నట్లు గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. నిరసనల సందర్భంగా దాడికి యత్నించిన కుట్రను ముందుగానే భగ్నం చేసినట్లు వెల్లడించారు.

ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని, మరిన్ని వివరాలను త్వరలో వెల్లడిస్తామని అధికారులు తెలిపారు.

## ఘనంగా ఎమ్మెల్యే 'బుయ్యని' జన్మదిన వేడుకలు




### . ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్ బహూకరణ

**ముద్ర ప్రతినిధి, తాండూర్:**

ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వాసుపత్రిలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించడంతో పాటు రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

ప్రజల అత్యవసర వైద్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని యునైటెడ్ వే బెంగళూరు స్వచ్ఛంద సంస్థ రూ.20 లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన అంబులెన్స్‌ను ప్రభుత్వాసుపత్రికి అందజేసింది. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ్ల నీరజ, ప్రజాప్రతినిధులు, వైద్య బృందం కలిసి అభిమానుల సమక్షంలో అంబులెన్స్‌ను ప్రారంభించారు.

ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేకంగా రూపొందించిన గీతాన్ని కూడా ఈ సందర్భంగా ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే కుమారులు బుయ్యని శివకుమార్ రెడ్డి, బుయ్యని అవినాష్ రెడ్డి నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి కేక్ కట్ చేసి ఎమ్మెల్యే మనోహర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో తాండూర్ పట్టణ అధ్యక్షుడు బాతుల నాగరాజ్, మున్సిపల్ కౌన్సిలర్లు, బంటు వేణుగోపాల్, అల్లాపూర్ శ్రీకాంత్, ప్రభాకర్ గౌడ్, పార్టీ సీనియర్ నాయకుడు కరణం పురుషోత్తం, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్ రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## అపరిచితుల మాటలు నమ్మి ఆన్ లైన్ లో డబ్బు పంపించవద్దు

- ఎస్పీ నరసింహ

**సూర్యాపేట, ఆగస్టు 5:**

అపరిచితుల మాటలు నమ్మి ఆన్‌లైన్‌లో డబ్బు పంపించడం, వ్యక్తిగత, బ్యాంకు వివరాలు పంచుకోవడం వల్ల సైబర్ మోసాలకు గురయ్యే ప్రమాదం ఉందని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ (ఐపీఎస్) హెచ్చరించారు. "సురక్షా కా తిరంగా—సైబర్ స్వతంత్ర తెలంగాణ, సైబర్ జాగృక్త దివాస్" కార్యక్రమంలో భాగంగా శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన సైబర్ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు.

విలువైన బహుమతులు, తక్కువ వడ్డీ రుణాలు, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తాయని చెప్పే వారిని సైబర్ మోసగాళ్లుగా గుర్తించాలని సూచించారు. ఓటీపీలు, పిన్ నంబర్లు, బ్యాంకు ఖాతా వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికీ ఇవ్వవద్దని, డిజిటల్ అరెస్ట్, ఆన్‌లైన్ పెట్టుబడుల పేరుతో జరిగే మోసాలను నమ్మవద్దని హెచ్చరించారు. విద్యార్థులు ఇంటర్నెట్‌ను విద్య, విజ్ఞానం కోసం వినియోగించుకోవాలని, సైబర్ మోసాలపై తాము అప్రమత్తంగా ఉండడమే కాకుండా కుటుంబ సభ్యులు, సమాజాన్ని చైతన్యపరచాలని ఎస్పీ సూచించారు.

ఈ కార్యక్రమంలో సూర్యాపేట టౌన్ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, సైబర్ సెక్యూరిటీ సెల్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, ఎస్ఐలు, కళాశాల యాజమాన్యం, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఐఫోన్ షోరూమ్ యజమానికి టోకరా.. - నిందితుడి అరెస్ట్



**ముద్ర కూకట్ పల్లి :** కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఐఫోన్ విక్రయిస్తామని నమ్మించి నగదుతో పరారైన ఘరానా మోసగాడిని పోలీసులు వేగంగా అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి రూ.40,000 నగదును స్వాధీనం చేసుకున్నారు.

కేపీహెచ్‌బీలోని 'ఆపిల్ వరల్డ్ ఐఫోన్ షోరూమ్' యజమాని మహమ్మద్ ముఖ్తార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్రైం నం. 982/2026 కింద బీఎన్ఎస్ సెక్షన్లు 318(4), 303(2) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆగస్టు 1న మధ్యాహ్నం షోరూమ్‌కు వచ్చిన నిందితుడు ఐఫోన్ అమ్ముతానని చెప్పి రూ.60,000 నగదు తీసుకున్నాడు. అనంతరం యజమాని దృష్టి మళ్లించి ఫోన్ ఇవ్వకుండా డబ్బులతో పరారయ్యాడు. సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక ఆధారాల ఆధారంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆగస్టు 5న నిందితుడైన నిజామాబాద్ జిల్లాకు చెందిన మోస్రా నవీన్ కుమార్ (36)ను కేపీహెచ్‌బీ పరిధిలో అదుపులోకి తీసుకున్నారు. మిగతా రూ.20,000 వ్యక్తిగత ఖర్చులకు వాడినట్లు నిందితుడు అంగీకరించాడు. నిందితుడిపై ఆదిలాబాద్, కోటగిరి, గచ్చిబౌలి పోలీస్ స్టేషన్లలోనూ పలు మోసం కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఖరీదైన వస్తువుల లావాదేవీల సమయంలో ప్రజలు అపరిచితులను నమ్మి మోసపోవద్దని, పూర్తి గుర్తింపు ధృవీకరించుకోవాలని ఎస్‌హెచ్‌ఓ సూచించారు.

## మోతీనగర్‌లో బీజేపీ నాయకుడు 'వడ్డేపల్లి' పర్యటన

**ముద్ర కూకట్ పల్లి:**

నియోజకవర్గంలోని మోతీనగర్ డివిజన్ పరిధిలో రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా పాండురంగానగర్ బస్తీలో స్థానిక సమస్యలను పరిశీలించి, ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు.

పర్యటనలోని ప్రధానంగా పాండురంగానగర్ వీకర్ సెక్షన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శిథిలావస్థకు చేరిన కమ్యూనిటీ హాల్‌ను రాజేశ్వరరావు పరిశీలించారు. అగ్నిప్రమాదం కారణంగా దెబ్బతిన్న హాల్ మరమ్మతుల కోసం మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి నిధులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. స్థానిక బస్తీ దవాఖానలో అధ్వానంగా మారిన టాయిలెట్ల పరిస్థితిని తెలుసుకుని, వాటి మరమ్మతులకు అవసరమైన నిధులను తన సొంత డబ్బు అందించి త్వరలోనే అందుబాటులోకి తెస్తామని ప్రకటించారు. కాలనీ వాసుల అభ్యర్థన మేరకు శ్రీ పోచమ్మ తల్లి ఆలయానికి ఎలక్ట్రికల్ సౌండ్ సిస్టంను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మోతీనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ఎర్ర స్వామి, నాయకులు రమేష్ నాయర్, సద్గుణ రెడ్డి, భాస్కర్, ఫణి కుమార్, కాలనీ పెద్దలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఇళ్ల కేటాయింపుపై ఎమ్మెల్యే వ్యాఖ్యలు అర్థరహితం

**ముద్ర కూకట్ పల్లి :**

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపుపై కూకట్‌పల్లి ఎమ్మెల్యే చేసిన ఆరోపణలు నిరాధారమని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకంగా ఇళ్లను కేటాయిస్తోందని తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే నిజమైన అర్హులైన పేదలను గుర్తించి ఇళ్లను పంపిణీ చేశామని, ఇందులో వివిధ జిల్లాల నుంచి కూకట్ పల్లికి వచ్చి స్థిరపడిన పేద కుటుంబాలకు కూడా న్యాయం జరిగిందని పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రుల సిఫారసులతో అర్హులకు ఇళ్లు కేటాయించడాన్ని కూడా ఎమ్మెల్యే తప్పుబట్టడం సరికాదని అన్నారు. 144 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులో అక్రమాలపై ప్రజలకు వాస్తవాలు తెలుసని, గత పదేళ్లలో ఎమ్మెల్యే చేసిన అక్రమాల వివరాలను త్వరలో ప్రజల ముందుంచుతామని కాంగ్రెస్ నేతలు హెచ్చరించారు. కూకట్ పల్లిలో కాంగ్రెస్‌కు పెరుగుతున్న ఆదరణను చూసి ఎమ్మెల్యే నిరాధార ఆరోపణలు చేస్తున్నారని, వాటిని ప్రజలు నరని పేర్కొన్నారు.

### బీఆర్ఎస్ నాయకుడి కుటుంబాన్ని పరామర్శించిన విఠల్ రెడ్డి

**ముద్ర ప్రతినిధి, తాండూర్:** వికారా బాద్ జిల్లా తాండూర్ నియోజకవర్గం, కోట్‌పల్లి మండలం ఇందోల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు శ్రీనివాస్ రెడ్డి తండ్రి రుక్మారెడ్డి మృతి చెందడంతో, వారి కుటుంబాన్ని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు విఠల్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రుక్మారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు. కార్యక్రమంలో కోట్‌పల్లి వర్కింగ్ ప్రెసిడెంట్ రాములు, లింగారెడ్డి, రాంచందర్, తలారి పండరి, శ్రీనివాస్ చారి, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సోషల్ మీడియా పోస్టులపై కఠిన చర్యలు వద్దు

- పోలీసులకు బీఆర్ఎస్ వినతి

**ముద్ర ప్రతినిధి, తాండూర్.**

ప్రజా సమస్యలపై సోషల్ మీడియాలో ప్రశ్నించే వారిపై అనవసరంగా కఠిన చర్యలు తీసుకోవద్దని బీఆర్ఎస్ తాండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీశైల్‌రెడ్డి పంజుగుల పోలీసులను కోరారు. ఈ మేరకు తాండూర్ డీఎస్పీతో పాటు టౌన్, రూరల్ సీఐలకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ విధానాలను ప్రశ్నించడం, విమర్శించడం, శాంతియుతంగా నిరసన వ్యక్తం చేయడం ప్రజల హక్కని ఆయన పేర్కొన్నారు.




2015లో సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఐటీ చట్టంలోని సెక్షన్ 66ఏ అమలులో లేదని గుర్తుచేస్తూ, చెల్లుబాటు కాని నిబంధనల ఆధారంగా చర్యలు తీసుకోకుండా, ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టాలు, పోస్టుల సందర్భాన్ని పరిగణనలోకి తీసుకుని నిర్ణయాలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రశ్నించే గొంతులను అణచివేయకుండా, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాలని పోలీసు అధికారులను శ్రీశైల్‌రెడ్డి కోరారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
గురువారం 06.08.2026
www.mudranews.in | @mudranews



### హై బీపీ, షుగర్ ఉంటే జాగ్రత్త

హై బీపీ, షుగర్ లేదా గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారు కొత్త వ్యాయామ విధానాన్ని ప్రారంభించే ముందు తప్పని సరిగా వైద్యుల సలహా తీసుకోవాలి. వాకింగ్ ఆరోగ్యానికి మేలు చేసినప్పటికీ, వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితులకు అనుగుణంగా వ్యాయామం చేయడం అత్యంత ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు.




# రీ సర్వేతోనే భూ వివాదాల పరిష్కారం

**కలెక్టర్ భవేష్ మిశ్రా:**

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** రీ సర్వే చేయటం ద్వారా భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. జిల్లాలోని న్యూ వెల్మల్ గ్రామ వ్యవసాయ భూముల్లో జరుగుతున్న రీ సర్వే ప్రక్రియను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఉన్న భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం భూముల రీ సర్వే ప్రక్రియ చేపట్టిందన్నారు. సర్వే అధికారులకు రైతులు సహకరించాలని సూచించారు. రీ సర్వే సమయంలో తప్పనిసరిగా రైతులు అందుబాటులో ఉండాలన్నారు. రీ సర్వే ప్రక్రియ త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. సంబంధిత అధికారుల బృందం తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో సర్వే ప్రక్రియకు సహకరించాలని అధికారులను ఆదేశించారు. గ్రామానికి సంబంధించి భూముల వివరాలు, చేపట్టిన సర్వే వివరాలు, అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎకరా భూమి సర్వేకు పట్టే సమయం వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. సర్వే ప్రక్రియను మొత్తం పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఏడి ల్యాండ్ సర్వే రికార్డ్ నరసింహమూర్తి, తహసీల్దార్ సంతోష్, ఎంపీడీవో రామకృష్ణ, సర్పంచ్ సాగర్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## సైబర్ జాగృతి దివస్ పోస్టర్లను విడుదల చేసిన ఎస్పీ



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** ప్రజల్లో సైబర్ నేరాలు, ఆన్ లైన్ మోసాలపై అవగాహన కల్పించేందుకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ జనరల్ ఆదేశాల మేరకు ప్రతి నెల మొదటి బుధవారం నిర్వహిస్తున్న "సైబర్ జాగృతి దివస్" కార్యక్రమంలో భాగంగా భైంసా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఎస్పీ డా.జి.జానకి షర్మిల పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు అత్యాధునిక పద్ధతులను ఉపయోగించి ప్రజలను మోసం చేస్తున్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటీపీలు, బ్యాంకు వివరాలు, పాస్ వర్డ్ లు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని, తెలియని లింకులు, అనుమానాస్పద యాప్ లు, నకిలీ వెబ్ సైట్లను ఓపెన్ చేయవద్దని ప్రజలకు సూచించారు. సైబర్ మోసానికి గురైనట్లు అనుమానం వచ్చిన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 హెల్ప్ లైన్ కు ఫోన్ చేసి, నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు నమోదు చేయాలని తెలిపారు. పోలీసు సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత ఉద్యోగాల కోసం సిద్ధం కావాలని, సమయాన్ని వృథా చేయకుండా వ్యక్తిగత అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు. చెడు అలవాట్లు, ఆన్ లైన్ బెట్టింగ్ లు, జూదం వంటి వాటికి దూరంగా ఉండి జీవితాన్ని ఉన్నత లక్ష్యాల వైపు మలుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, ఇన్స్పెక్టర్లు రవీందర్ నాయక్, దీపక్, సాయికుమార్, ఎస్ఐ లు, పోలీసు సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



**ముద్ర, కోరుట్ల;** ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోనీ వర్షకొండ గ్రామంలో గత ఐదు రోజుల క్రితం బస్టాండ్ కూడలి లోని చర్చి వద్ద సల్వాల రాజేష్ అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనం పై వెళ్తుండగా మెట్పల్లి పట్టణానికి చెందిన రవీంద్ర స్కూల్ బస్సు డ్రైవర్ గుండు గణేష్ అనే వ్యక్తి బస్సును అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా నడుపుతూ రాజేష్ ప్రయాణిస్తున్న బలంగా ఢీ కొట్టడం తో అదుపుతప్పి స్కూల్ బస్సు యొక్క ముందు భాగంలో పడి తలకి బలమైన రక్త గాయం అయింది వెంటనే మెట్పల్లి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి ఆ తర్వాత మెరుగైన చికిత్స నిమిత్తం నిజామాబాద్ పట్టణంలోని ప్రతిభ హాస్పిటల్లో అడ్మిట్ చేయగా బుధవారం రోజు చికిత్స పొందుతూ మధ్యాహ్నం సమయంలో మరణించినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతుడి తల్లి నర్సు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఇబ్రహీంపట్నం ఎస్సై జీ. నవీన్ తెలిపారు.

# ప్రధానాసుపత్రిలో సమస్యలను పరిష్కరించండి

**సి టి స్కాన్, ఎక్స్ రే పనిచేయక పోవడంపై ఎంఎల్ఏ ఏలేటి అసహనం**




**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** నిర్మల్ జిల్లా ప్రజానీకానికి వైద్య సౌకర్యాలు అందించే ప్రధానసుపత్రిలో ఎక్స్ రే, సి టి స్కాన్ యంత్రాలు పని చేయక పోవటం పై నిర్మల్ ఎంఎల్ఏ అసహనం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన ప్రధానసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా అత్యవసర యంత్రాలు పని చేయక పోవటం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో వైద్యాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రోజురోజుకు రోగుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ సిటీ స్కాన్ యంత్రం పని చేయకపోవడం, ఎక్స్రే ఫిలింల కొరత ఉండడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమస్యలను రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి సిటీ స్కాన్ మరమ్మతులు చేపట్టడంతో పాటు ఎక్స్రే ఫిలింల కొరత లేకుండా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన, సకాలంలో వైద్య సేవలు అందించాలన్నారు. ఆసుపత్రిలోని వివిధ వార్డులను పరిశీలించి చికిత్స పొందుతున్న రోగులతో నేరుగా మాట్లాడారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత, వైద్య సిబ్బంది పనితీరు, ఇతర సౌకర్యాల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలపై చర్చించారు. కేంద్ర ప్రభుత్వ నిధులు రూ. 25 కోట్లతో నిర్మించిన క్రిటికల్ కేర్ ఆసుపత్రి భవనం పూర్తయిందని, ప్రారంభోత్సవం అనంతరం ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని వెల్లడించారు. దీంతో జిల్లా ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు మరింత చేరువ కానున్నాయని పేర్కొన్నారు. ఆసుపత్రి ఆవరణను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్‌ను ఆదేశించారు. ప్రతిరోజూ ఫాగింగ్ నిర్వహించాలని సూచించారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించడంతో పాటు రోగులతో ఆప్యాయంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ స్థానిక కౌన్సిలర్ గంజి రాజు, కౌన్సిలర్లు జింక సూరి, శ్రీరామోజు నరేష్, ఈశ్వర్, అర్జున్, విఠల్, సూరజ్, సాత్విక్, బి జె వై ఎం జిల్లా అధ్యక్షులు నిరంజన్ రెడ్డి, బీజేపీ నాయకులు జుట్టు దినేష్, జాప ప్రసాద్, కందుల హరీష్, అచ్యుత్ రావు, తో పాటు వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరగాళ్ల పట్ల జాగ్రత్తగా ఉండాలి

**జిల్లా ఎస్పీ అశోక్ కుమార్....**

**"సైబర్ జాగృతిక దివాస్" లో భాగంగా విద్యార్థులకు సైబర్ క్రైమ్ అవగాహన....**




**ముద్ర, కోరుట్ల;** జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో "సైబర్ జాగృతిక దివాస్" లో భాగంగా బుధవారం రోజు పలు కళాశాలల విద్యార్థులకు సైబర్ క్రైమ్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, జిల్లా అదనపు ఎస్పీ చేతన్ నితిన్ ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా స్టాక్ ట్రేడింగ్/ స్టాక్ పెట్టుబడి మోసాలు, క్రెడిట్ కార్డ్ మోసాలు, ఆన్‌లైన్ షాపింగ్ మోసం, లోన్ ఆప్స్ మోసాలు, డిజిటల్ అరెస్ట్ మరియు అపరిచితుల వీడియో కాల్స్ వంటి వాటితో పాటు ఆన్లైన్ లో ఏమి చేయాలి, ఏమి చేయకూడదు వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఏవైనా సమస్యలు ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 1930 కు సంప్రదించాలి సుచించారు. ఈ సందర్భంగా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యంగా యువత ఫోన్ కు దూరంగా ఉండాలని, యువత ఎక్కువగా సోషల్ మీడియాలో ఉంటారు కాబట్టి యువతను దృష్టిలో పెట్టుకొని సైబర్ నేరగాళ్లు మోసాలు చేస్తారని అన్నారు. ఫోన్ మంచితోపాటు చెడు కూడా ఉందని మంచికి మాత్రమే వాడాలని చెడ్డ పనులకు దూరంగా ఉండాలని చూచించారు. ఎలక్ట్రికల్ గ్యాడ్జెట్ వల్ల మోసాలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సైబర్ క్రైం చేయడానికి మనుషులే కలవ వలసిన అవసరం లేదని, దేశంలోఎక్కడి నుండి అయిన ఆన్లైన్ లో సైబర్ మోసం చేయవచ్చునని చెప్పారు. సైబర్ మోసాలు జరిగినప్పుడు పట్టుకోవడం కష్టం కాబట్టి ముందుగానే మోసాలు జరుగకుండా జాగ్రత్త పడాలని విద్యార్థులను కోరారు. సైబర్ మోసగాల్లు ఎమోషనల్ గా మరియు మనలో ఉండే భయంతో మోసం చేస్తారని అన్నారు. అవగాహన తోనే సైబర్ మోసాలను అరికట్టడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు. దీనిని ప్రతి ఒక్కరూ పాటించి సైబర్ నేరాలకు గురికావద్దని తెలిపారు. అనే సైబర్ ఆవగాహన కార్యక్రమం పై పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్, డీఎస్పీ రాములు, సిఐ, ఎస్సై లు, పోలీస్ కళా బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

* రూ. 20 వేల విలువైన పుస్తకాల పంపిణీ
* త్వరలోనే డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు
* దేవులపల్లి వినయ్ ప్రసాద్



**ముద్ర చిగురుమామిడి:** మండలంలోని సుందరగిరి స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం గ్రామస్థుడు, సాఫ్ట్ వేర్ ఉద్యోగి దేవులపల్లి వినయ్ ప్రసాద్ 10వ తరగతి విద్యార్థులకు రూ. 20,000 విలువగల డిక్షనరీలు, లైబ్రరీ పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... మన ఊరి విద్యార్థులు చదువులో రాణించి భవిష్యత్తులో ఐఏఎస్, ఐపీఎస్, ఆర్డీఓ, ఎంఆర్ఓ, ఎంపీడీఓ వంటి ఉన్నత పదవులను చేపట్టాలని ఆకాంక్షించారు. గ్రామీణ విద్యార్థుల నైపుణ్యాలను పెంచేందుకు త్వరలోనే పాఠశాలలో ఆధునిక డిజిటల్ లైబ్రరీని ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానని అయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో టాటా ఏఐఏ కరీంనగర్ బ్రాంచ్ మేనేజర్ కాశబోయినా వీరాస్వామి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## తెలంగాణ రక్షణ సేనలో జోరుగా చేరికలు




**ముద్ర, కోరుట్ల;** తెలంగాణ రక్షణ సేనలో భారీగా చేరికలు కొనసాగుతున్నాయి. మెట్పల్లిలో జరిగిన కార్యక్రమంలో టీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి డాక్టర్ రఘు ఆధ్వర్యంలో పలువురు యువత తెలంగాణ రక్షణ సేనలో చేరారు. వారికి డాక్టర్ రఘు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. చిన్న మెట్ పల్లి యూత్ అధ్యక్షులు చిలువేరి నితిన్, కోరుట్ల యూత్ నేతలు కొండా బృహదేశ్వర్, మైస నరేందర్, శృంగారపు రాము, పసుల పవన్, బెజ్జరపు మణికంఠ, తదితరులు చేరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అజార్, సుఖేందర్ గౌడ్, లింగాపెల్లి సంజీవ్, రాజన్న, నాని, ప్రశాంత్ ముఖిమ్, తోట శ్రీనివాస్, గంగాధర్, వెంకటేష్, ప్రణీత్, నాగరాజు, నారాయణ, ప్రణయ్ గౌడ్ పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధి కోసం ప్రణాళిక



**ముద్ర చిగురుమామిడి :** గ్రామాభివృద్ధి లో అందరూ భాగస్వామ్యం అవ్వాలని ,అందుకు గాను తగిన సలహాలు సూచనలు ఇవ్వాలని సర్పంచ్ గుళ్ళ రజిత రాజు అన్నారు. ఈరోజు నవాబుపేట్ గ్రామంలో సర్పంచ్ గుళ్ళ రజిత రాజు గారి అధ్యక్షతన గ్రామసభ ఏర్పాటు చేయడం జరిగింది . ఈ సభలో గ్రామంలో జరిగిన అభివృద్ధి పనుల గూర్చి మరియు ఈ సంవత్సరం చేయబోయే అభివృద్ధి పనుల కొరకై 2026 ప్లాన్ ప్రణాళిక కోసం చర్చించడం జరిగింది గ్రామంలో ఉన్న ప్రతి వాడకు వీధి దీపాలు , సీ సి రోడ్ల నిర్మాణం జరిగేలా చూడాలని సర్పంచ్ అన్నారు వర్ష కాలం కాబట్టి విషజ్వరాలు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆశ వర్కర్లకు సూచించడం జరిగింది. గ్రామంలో ఎలాంటి సమస్య ఉన్న ఎల్లప్పుడూ గ్రామస్తులకు అందుబాటులో తాను ఉంటానని కూడా అన్నారు ఈ సభలో ఉపసర్పంచ్ ఇనుగాల శ్రీనివాస్ రెడ్డి మరియు వార్డు సభ్యులు అంగన్వాడి టీచర్లు, ఆశ వర్కర్లు, వివో ఏ లు , మాజీ ప్రజాప్రతినిధులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## పురుషోత్తమ క్షేత్రం 'పూరి'

**-బ్రహ్మశ్రీ డాక్టర్ గర్రెపల్లి మహేశ్వర శర్మ..**




**ముద్ర, కోరుట్ల;** సాక్షాత్తు శ్రీమహావిష్ణువు స్వయంగా నడయాడిన పురుషోత్తమ క్షేత్రం 'పూరి జగన్నాథ' ప్రాంతమని శృంగేరి శారదాపీఠ ఆస్థాన పౌరాణికులు, పురాణ ప్రవర బ్రహ్మశ్రీ డాక్టర్ గర్రెపల్లి మహేశ్వరశర్మ పేర్కొన్నారు. సనాతన ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో చేపట్టిన అష్టాదశ మహాపురాణ ప్రవచన జ్ఞాన యజ్ఞంలో భాగంగా శ్రీ బ్రహ్మ మహాపురాణ ప్రవచన సప్తాహం 5వ రోజు కోరుట్ల వాసవి కళ్యాణ భవనంలో బుధవారం సాయంత్రం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మహేశ్వరశర్మ ప్రవచనం చేస్తూ శ్రీమహావిష్ణువు విశ్వకర్మను వెంటపెట్టుకొని పూరి క్షేత్రానికి వచ్చి, దేవ శిల్పి విశ్వకర్మచే శ్రీకృష్ణుడు, బలరాముడు, సుభద్ర విగ్రహాలను చెక్కించాడన్నారు. స్వామి స్వయంగా ఆలయ నిర్మాణంలో పాలుపంచుకున్న గొప్ప ప్రాంతం ఆ పురుషోత్తమ క్షేత్రమని పేర్కొన్నారు. జీవితంలో ఒక్కసారైనా ఆ క్షేత్రానికి వెళ్లి రావడం పూర్వజన్మ సుకృతం అని సనాతన ధర్మంలో, బ్రహ్మ పురాణంలో చెప్పబడిందన్నారు. ఒరిస్సా రాష్ట్రంలోని భువనేశ్వర్ సమీపంలో 'పూరి జగన్నాథ్'తో పాటూ 'కోణార్క సూర్య భగవాన్ క్షేత్రం' తదితర పుణ్యక్షేత్రాలు వెలిసాయని మహేశ్వరశర్మ వివరించారు. ఈ కార్యక్రమంలో సనాతన ధర్మ ప్రచార సమితి ప్రధాన కార్యదర్శి బట్టు హరికృష్ణ, కోశాధికారి రేగుంట రాజారామ్, పురాణ కమిటీ చైర్మన్ & పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు పడిగెల శ్రీనివాస్, నిర్వాహకులు మోటూరి రాజేంద్రప్రసాద్, రాచమడుగు శ్రీనివాసరావు, మంచాల రాజలింగం, కొత్త గణేష్, పాల్గొన్నారు.

## సింగరేణి విశ్రాంత ఉద్యోగి దారుణ హత్య.. కుమారుడిపై అనుమానం

ముద్ర న్యూస్, ఓదెల : పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలోని మడక గ్రామంలో సింగరేణి విశ్రాంత ఉద్యోగి వేపచెట్టు మాధయ్య (70) హత్యకు గురయ్యాడు. ఇంటి ఆవరణలో స్నానం చేస్తున్న సమయంలో బండరాయితో దాడి చేసి చంపినట్లు స్థానికులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనలో మాధయ్య చిన్న కుమారుడు బాపురావుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మద్యం మత్తులో ఉన్న బాపురావును గ్రామస్తులు పట్టుకుని పొత్కపల్లి పోలీసులకు అప్పగించారు. కుటుంబంలో ఆస్తి వివాదాలు, డబ్బు విషయంలో తరచూ గొడవలు జరుగుతున్నట్లు సమాచారం.

## కొలెస్ట్రాల్‌పై సానుకూల ప్రభావం



నిత్యం వాకింగ్ చేయడం వల్ల చెడు కొలెస్ట్రాల్ (LDL) తగ్గి, మంచి కొలెస్ట్రాల్ (HDL) పెరిగే అవకాశాలు ఉంటాయి. దీంతో రక్తనాళాల్లో కొవ్వు పేరుకు పోయే ప్రమాదం తగ్గి గుండె జబ్బుల రిస్క్ కూడా తగ్గుతుంది.

# సైబర్ నేరాల కట్టడికి అప్రమత్తత, అవగాహనే ఆయుధం

**- పోలీస్ కమిషనర్ సునీల్ దత్**



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:**

సైబర్ నేరాల నివారణకు ప్రజల్లో అప్రమత్తత, అవగాహన అత్యంత కీలకమని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. సైబర్ జాగృక్త దివస్ సందర్భంగా ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన 'సురక్ష కా తిరంగా – సైబర్ స్వతంత్ర తెలంగాణ, ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్' అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

డిజిటల్ లావాదేవీలు పెరగడంతో సైబర్ మోసాలు కూడా అధికమవుతున్నాయని, బ్యాంకు వివరాలు, ఓటీపీ, యూపీఐ పిన్, సీవీవీ వంటి గోప్య సమాచారాన్ని ఎవరికీ వెల్లడించవద్దని సూచించారు. తెలియని లింక్‌లు, క్యూఆర్ కోడ్‌లు, నకిలీ యాప్‌లు, పెట్టుబడులు, ఉద్యోగాలు, డిజిటల్ అరెస్టు పేరుతో జరిగే మోసాలపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

సైబర్ మోసాలకు గురైన వారు వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ డీఎస్పీ ఫణిందర్, ఇన్స్పెక్టర్లు కరుణాకర్, బాలకృష్ణ, మోహన్ బాబు, భానుప్రకాష్, ఉస్మాన్ షరఫ్, రవికుమార్, ఎస్సై లు రంజిత్ కుమార్, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాల విద్యార్థులకు మెరుగైన మౌళిక వసతులు కల్పించాలి



**- జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:**

ప్రభుత్వ గురుకుల పాఠశాలలో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌళిక వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. బుధవారం రాజాపేట మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర పాఠశాల మరియు కళాశాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. గతంలో పర్యటన సందర్భంగా వచ్చినప్పుడు సూచించిన పెండింగ్ పనుల పురోగతిని పరిశీలించారు. హాస్టల్‌లో కిటికీల మరమ్మతులు, డోర్ల ఫిట్టింగ్, మెష్ అమరిక, గదుల్లో వర్షపు నీటి లీకేజీల నివారణ కోసం పైకప్పు ఫ్లాస్టింగ్ పనులను పరిశీలించి, ఇంకా మిగిలిన ఉన్న పనులను కూడా వెంటనే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. హాస్టల్‌లోని కొన్ని టాయిలెట్లు బ్లాక్ అయి వినియోగానికి అనుకూలంగా లేవని గుర్తించి, సంబంధిత ఎస్.ఈ. వెంటనే మరమ్మతులు చేపట్టి పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు.

అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, మెనూ ప్రకారం అందించాల్సిన గుడ్లు,చికెన్ వంటి ఆహార పదార్థాలు క్రమం తప్పకుండా అందడం లేదని విద్యార్థులు తెలియజేయడంతో కలెక్టర్ వెంటనే సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి ఒప్పందం ప్రకారం సరఫరా జరిగేలా చూడాలని, దీనిపై పాఠశాల ప్రిన్సిపాల్ ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని సూచించారు. సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత కాంట్రాక్టర్‌ను బ్లాక్‌లిస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ తరగతి గదులను పరిశీలించారు, తరగతి గదులలో గోడలు, పైకప్పుల పెచ్చులు ఊడిపోతున్న వాటిని వెంటనే మరమ్మతు చేయాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గురుకుల కళాశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో చదువుతున్న ఇంటర్మీడియట్ విద్యార్థులకు జేఈఈ,నీట్ వంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యేలా ప్రత్యేక శిక్షణ, అనుభవం కలిగిన లెక్చరర్ డాక్టర్ రాజును నియమించారు. విద్యార్థులు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధాకర్, యం ఆర్ ఓ, ఎంపిడిఓ నాగవేణి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి

**- ఎస్పీ అక్షాన్ష్ యాదవ్**



**యాదాద్రి భువనగిరి, ఆగస్టు 5:**

డిజిటల్ యుగంలో సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ అన్నారు. "సురక్షా కా తిరంగా" కార్యక్రమంలో భాగంగా భువనగిరిలోని సుమంగళి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సైబర్ అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు, పిన్ నంబర్లను ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. ఫిషింగ్ లింకులు, నకిలీ కాల్స్, సోషల్ మీడియా మోసాలు, ఆన్‌లైన్ ఆర్థిక మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. సైబర్, ఫోరెన్సిక్ నిపుణుడు సందీప్ ముదల్కర్ ప్రజెంటేషన్ ద్వారా సైబర్ నేరాల తీరుతెన్నులు, వాటి నుంచి రక్షణ మార్గాలను వివరించారు. సైబర్ నేరాల నివారణకు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జిల్లా పోలీసులు నిరంతరం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.

ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు లక్ష్మీనారాయణ, వినోద్ కుమార్, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

## నేటి నుంచి సిపిఐ ప్రజా చైతన్య యాత్ర

**- జిల్లా కార్యదర్శి దండి సురేష్**




**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:**

సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు ఖమ్మం జిల్లా వ్యాప్తంగా గురువారం నుంచి ప్రజా చైతన్య పాదయాత్రలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడు హైవే జంక్షన్ వద్ద సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు యాత్రను ప్రారంభిస్తారని చెప్పారు. ఈ నెల 13 వరకు జిల్లాలోని 20 మండలాల్లో పాదయాత్రలు కొనసాగనున్నట్లు వెల్లడించారు.

కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను ప్రజలకు వివరించేందుకు ఈ యాత్రలు చేపడుతున్నామని సురేష్ తెలిపారు. జాతీయ ఉపాధి హామీ పథకాన్ని యథాతథంగా అమలు చేయాలని, రైతు వ్యతిరేక విధానాలు, లేబర్ కోడ్స్, వ్యవసాయ సబ్సిడీల తగ్గింపు వంటి అంశాలపై ప్రజలను చైతన్యపరుస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీల అమలులో జాప్యం చేస్తోందని, రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్ల వంటి అంశాలపై కూడా ప్రజల్లో అవగాహన కల్పిస్తామని తెలిపారు. పాదయాత్రల సందర్భంగా పలు చోట్ల సభలు నిర్వహించనున్నట్లు, ఈ నెల 13న ఖమ్మంలో జరిగే బహిరంగ సభతో యాత్రలు ముగుస్తాయని దండి సురేష్ వెల్లడించారు.

## రైతు భాంధవుడు 'బోడెపూడి' 29వ వర్ధంతి




**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:**

సి.పి.ఎం రాష్ట్ర నాయకులు, మాజీ శాసనసభ పక్ష నేత బోడెపూడి వెంకటేశ్వరావు 29 వర్ధంతి సభ సిపిఎం కార్యాలయంలో జరిగింది. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదినేని రమేష్, సీనియర్ నాయకులు పొన్నం వెంకటేశ్వరావు మాట్లాడుతూ బోడెపూడి రైతు నేతగా రైతు సమస్యలపై నిరంతరం అసెంబ్లీలో తన గళం వినిపించాడని అందరికీ ఆజాత శత్రువు అని తర తరాలు చెప్పుకోదగ్గ నాయకుడని, ప్రజా ప్రతినిధిగా తనకు తానే సాటిగా ఉన్నాడని, శాసన సభ పక్ష నాయకుడిగా ఎదిగిన తీరు, అందరినీ బాబు అంటూ పలకరించే తీరు తనకున్న ఆభరణాలు అనీ చెప్పారు.. పార్టీలో సాధారణ కార్యకర్త నుండి జిల్లా కార్యదర్శిగా ఎదిగిన తీరు అందరికీ ఆదర్శం అని అన్నారు. 104 గ్రామాలకు ఫ్లోరైడ్ రహిత నీరు అందించిన ఘనత దానికి బోడేపూడి సుజల స్రవంతి అని పేరు పెట్టడం ఈనాడు కొంత మంది దానిని తొలిగించిన ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉన్నాడనీ అది ఎవ్వరు తొలిగించలేరని వారి నాయకత్వంలో పని చేసినందుకు గర్వంగా ఉన్నదని తెలిపారు.

బివికె ట్రస్ట్ జిఎం శ్రీనివాసరావు ఆధ్యక్షత వహించిన ఈ సభలో ఈ సభలో యర్రా శ్రీనివాసరావు, మల్లెంపాటి వీరభద్రం, బండి పద్మ,మెరుగు సత్యనారాయణ, కె దేవేంద్ర, అఫ్జల్, సదానంద్, ఝూన్సీకుమారి, పి ప్రమీల, బండారు రమేష్, నందిపాటి మనోహర్, మెరుగు రమణ, వాసిరెడ్డి దయానంద్, బివికె ట్రస్టు సభ్యు లు, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. తొలుత బోడేపూడి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

## మత్తుపదార్థాలు, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో 2కే రన్




**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:**

మత్తుపదార్థాలు, డ్రగ్స్ నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో బుధవారం యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మంగ ప్రవీణ్ ఆధ్వర్యంలో 2కే రన్ కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి డీఎస్పీ రవీందర్ యాదవ్, పట్టణ సీఐ రమేష్, ఎస్ఐ లక్ష్మీ నరసయ్య తో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేజ్ చిస్తి, మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె. జంగీర్, మాజీ కౌన్సిలర్ ఈరపాక నరసింహ, డీసీసీ కార్యదర్శి మజార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎస్పీ రవీందర్ యాదవ్ మాట్లాడుతూ యువత మత్తుపదార్థాలు, డ్రగ్స్ వంటి వ్యసనాలకు దూరంగా ఉండి విద్యపై దృష్టి సారించి ఉన్నత చదువులు అభ్యసిస్తూ జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. మత్తుకు బానిసై తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బట్టు. సందీప్, రేగు. రమేష్, సన్నీ, మసూద్, నితీష్ సాయిచరణ్, జలీల్, ఆబేద్ పాల్గొన్నారు.

## తల్లిపాలు రోగనిరోధక శక్తిని పెంచుతాయి




**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:**

తల్లిపాలు రోగనిరోధక శక్తిని పెంచుతాయని మున్సిపల్ చైర్మన్ తంగేళ్లపల్లి శ్రీవాణి రవికుమార్ అన్నారు. పట్టణంలోని 14వ వార్డు హుస్నాబాద్ బీసీ కాలనీలో బుధవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ తుమేటి పాండు, 32వ వార్డు కౌన్సిలర్ బర్రె సంగవి కరుణాకర్, 33వ వార్డు కౌన్సిలర్ నాకోటి నాగేష్, ఐసీడీఎస్ సూపర్వైజర్లు పద్మ, అన్వర్, అంగన్‌వాడీ టీచర్లు భాగ్య, రుక్మిణి, భువనేశ్వరి, అనితతో పాటు చిన్నారుల తల్లులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జీఎంపీఎస్ రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలి



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:**

ఈ నెల 22, 23, 24 తేదీలలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా చెంగిచెర్లలో జరిగే జీఎంపీఎస్ రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా గొర్రెల, మేకల పెంపకందార్ల సంఘం జిల్లా కార్యదర్శి దయ్యాల నరసింహ పిలుపునిచ్చారు. బుధవారం వలిగొండ మార్కెట్ యార్డులో జిఎంపిఎస్ మండల కమిటీ సమావేశం మండల కార్యదర్శి బుగ్గ చంద్ర మౌళి అధ్యక్షతన నిర్వహించగా ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. గొర్రెలు, మేకల పెంపకందారులు తరతరాలుగా వృత్తిని చేసుకుంటూ సమాజానికి బలమైన ఆహారాన్నిస్తూ వీరు మాత్రం సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మహాసభలో గొర్రెల కాపరులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్తు ఉద్యమాలు రూపొందిస్తామని తెలిపారు. ఈ మహాసభలకు గొల్ల, కురులు, విద్యావంతులు,మేధావులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిఎంపిఎస్ మండల అధ్యక్షుడు నారి వెంకటేష్, నాయకులు చేగురి నరసింహ, కర్ణ కంటి యాదయ్య, నారి రామస్వామి, సల్ల ఐలయ్య, భీమనబోయిన జంగయ్య, నారి లింగస్వామి, కొమ్ము నరేష్ లు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

**- మండల విద్యాధికారి నాగేశ్వర్ రావు**

**దేవరకొండ, ఆగస్టు 5 (ముద్రన్యూస్):**

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నామని మండల విద్యాధికారి నాగేశ్వర్ రావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని గాజీనగర్ ఎంపిపిఎస్ పాఠశాలలో నూతనంగా చేరిన విద్యార్థులకు ఎంఈవో చేతుల మీదుగా సాముహిక అక్షరాభ్యాసం చేశారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చిన ముత్యాలు, సర్పంచ్ బుడిగపాక పార్వతమ్మ వెంకటయ్య, ఉప సర్పంచ్ బత్తుల సత్యనారాయణ, పాఠశాల విద్యా కమిటి చైర్మన్ లలిత, వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు లక్ష్మారెడ్డి విమల, విజయ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



### 3-3-3 వాకింగ్ టెక్నిక్ అంటే ఏమిటి?

హై బీపీ, కొలెస్ట్రాల్, షుగర్ నియంత్రణకు 3-3-3 వాకింగ్ టెక్నిక్ ఉపయోగకరంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. రోజుకు 3 సార్లు, ప్రతి సారి 30 నిమిషాలు, భోజనం తర్వాత 30 నిమిషాల గ్యాప్‌తో నడవడమే ఈ విధానం. దీంతో గుండె ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు రక్తంలో చక్కెర స్థాయిలు కూడా నియంత్రణలో ఉండేందుకు సహాయపడుతుంది.



# అమెరికా రాయబారి సెర్జియో గోర్‌తో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి భేటీ

**ముద్ర, హైదరాబాద్ :** భారత్‌లో అమెరికా రాయబారి సెర్జియో గోర్ తో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఢిల్లీలో సమావేశమయ్యారు. ఈ మర్యాదపూర్వక భేటీ 30 నిమిషాలకు పైగా కొనసాగింది. ఈ సందర్భంగా వివిధ అంశాలు చర్చించారు. తెలంగాణలో విద్య, ఉపాధి, పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధన రంగాల్లో సహకారాన్ని బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి ప్రస్తావించారు. ఉన్నత విద్య కోసం అమెరికాకు వెళ్లే తెలంగాణ విద్యార్థులకు వీసాలను పెంచాలని, వీసా అపాయింట్‌మెంట్లు సకాలంలో లభించేలా సహకరించాలని కోరారు. వీసా ఇంటర్వ్యూ స్లాట్లను పెంచాలని, వీసా దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేయాలని కోరారు. అమెరికాలో ఉద్యోగాలు చేస్తున్న తెలంగాణ కు చెందిన వివిధ రంగాల నిపుణుల సమస్యలను కూడా రాయబారి దృష్టికి తీసుకెళ్లారు. H-1B వీసా ప్రాసెసింగ్, రెన్యువల్, వీసా స్టాంపింగ్ ఆలస్యం కాకుండా సరళతరం చేయాలని కోరారు. వీసా నిబంధనల్లో వచ్చే మార్పులపై ముందుగానే సమాచారం అందించాలని సూచించారు. అమెరికాలో చదువుతున్న తెలంగాణ విద్యార్థుల భద్రత, సంక్షేమంపై కూడా చర్చించారు. తెలంగాణలో అమెరికా సంస్థలకు విస్తృత పెట్టుబడి అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా వివరించారు. ఐటీ, కృత్రిమ మేధ, లైఫ్ సైన్సెస్, ఫార్మా, స్టార్టప్‌లు, పరిశోధన, ఆధునిక సాంకేతిక రంగాల్లో భాగస్వామ్యానికి రాష్ట్రం సిద్ధంగా ఉందని తెలిపారు. అమెరికా విశ్వవిద్యాలయాలు తెలంగాణ విద్యాసంస్థలతో కలిసి పనిచేసేలా సహకరించాలని కోరారు. విద్యార్థుల మార్పిడి, పరిశోధన, ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను విస్తరించాలని సూచించారు. అమెరికాలో అత్యంత వేగంగా విస్తరిస్తున్న భారతీయ భాషల్లో తెలుగు ఒకటని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. భారతదేశ చరిత్ర, సంస్కృతిపై రాయబారి సెర్జియో గోర్‌కు ఉన్న అవగాహన తనను ఆకట్టుకుందన్నారు. ప్రత్యేకంగా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, వంటకాలు, రాష్ట్ర బలాలపై రాయబారి చూపిన ఆసక్తిని ముఖ్యమంత్రి అభినందించారు. తెలంగాణ–అమెరికా మధ్య వ్యాపారం, పెట్టుబడులు, సాంస్కృతిక మార్పిడి, ప్రజల మధ్య సంబంధాలను మరింత విస్తరించేందుకు సంపూర్ణ



సహకారం అందిస్తామని రాయబారి సెర్జియో గోర్ హామీ ఇచ్చారు.

## తెలంగాణ చాంబర్ ఆఫ్ కామర్స్ ఉపాధ్యక్షుడిగా వినోద్ అగర్వాల్



**ముద్ర, హైదరాబాద్ :** ఎం పి ఎల్ గ్రూపు మేనేజింగ్ డైరెక్టర్ వినోద్ కుమార్ అగర్వాల్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ( ఎఫ్ టి సి సి ఐ ) ఉపాధ్యక్షుడుగా ఎన్నికయ్యారు. వ్యాపారదక్షత, దూర దృష్టి, నిర్వహణా సామర్థ్యం, నాయకత్వ లక్షణాలు, పారిశ్రామిక రంగానికి అందించిన సేవలు ఆయన ఎన్నికకు దోహదం చేశాయి. 2026-27 సంవత్సరంలో ఆయన ఈ పదవీ బాధ్యతలు నిర్వహిస్తారు. ప్రముఖ పారిశ్రామికవేత్త అయిన వినోద్ కుమార్ అగర్వాల్ నేతాజీ నగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ గా కూడా సేవలు అందిస్తున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

## జేఎన్టీయూ మెట్రో స్టేషన్ వద్ద పోగొట్టుకున్న బ్యాగ్ సురక్షితం..

**బాధితుడికి అప్పగించిన కేపీహెచ్‌బీ పోలీసులు**

**ముద్ర కూకట్‌పల్లి :** బాచుపల్లిలోని కేటీఆర్ కాలనీకి చెందిన శ్రీ తుకారాం (55) అనే వ్యక్తి అనుకోకుండా జేఎన్టీయూ మెట్రో స్టేషన్ సమీపంలోని మెహఫిల్ హోటల్ వద్ద తన విలువైన పత్రాలు ఉన్న బ్యాగును పోగొట్టుకున్నారు. ఆ బ్యాగులో ఒరిజినల్ భూమి పత్రాలతో పాటు ఇతర విలువైన వస్తువులు ఉన్నాయి.సమాచారం అందుకున్న వెంటనే కేపీహెచ్‌బీ సీసీటీవీ ఆపరేటర్ యాదయ్య, క్రైమ్ టీమ్ మరియు జేఎన్టీయూ మెట్రో జంక్షన్ ట్రాఫిక్ కానిస్టేబుల్ సమన్వయంతో అప్రమత్తమయ్యారు. సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించి, తక్షణమే స్పందించి ఆ బ్యాగును గుర్తించి విజయవంతంగా రికవర్ చేశారు.అనంతరం బాధితుని కుమారుడు లోకేష్ సమక్షంలో, ఎలాంటి నష్టం జరగకుండా అన్ని పత్రాలు, విలువైన వస్తువులతో కూడిన బ్యాగును సురక్షితంగా అందజేశారు. సకాలంలో స్పందించి బాధ్యతాయుతంగా వ్యవహరించిన సీసీటీవీ ఆపరేటర్ యాదయ్య, క్రైమ్ టీమ్ మరియు ట్రాఫిక్ పోలీసుల సమన్వయ సేవలను కేపీహెచ్‌బీ పోలీసులు ప్రత్యేకంగా అభినందించారు.

## సైబర్ భద్రతపై అవగాహన

**ముద్ర ప్రతినిధి, తాండూర్:** సైబర్ భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రతి నెల మొదటి బుధవారాన్ని భారత ప్రభుత్వం 'సైబర్ జాగ్రూకత దివస్' గా నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా అన్నారు . బుధవారం తాండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన సైబర్ అవగాహన కార్యక్రమంలో పాల్గొని, తాండూర్ చౌరస్తా నుండి సెయింట్ మార్క్ స్కూల్ వరకు నిర్వహించిన భారీ సైబర్ అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు.అనంతరం సెయింట్ మార్క్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన సైబర్ అవగాహన సభలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజలను ఉద్దేశించి ఎస్పీ స్నేహ మెహ్రా మాట్లాడుతూ... ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాల నుండి ఇంటర్నెట్ వినియోగదారులను రక్షించడంపై దృష్టి సాధించడం జరిగిందన్నారు. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న కొద్దీ సైబర్ నేరాలు కూడా కొత్త రూపాల్లో పెరుగుతున్నాయని, ప్రతి ఒక్కరూ డిజిటల్ ప్రపంచంలో అప్రమత్తంగా వ్యవహరించడం అత్యంత అవసరమన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ, తాండూర్ డి.ఎస్.పి, మున్సిపల్ చైర్ పర్సన్, తాండూర్ పట్టణ మున్సిపల్ కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

## భూభారతి చట్టంపై అవగాహన ఉండాలి

**డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్**



**ముద్ర ప్రతినిధి, మెదక్:** భూ భారతి చట్టంపై అవగాహన కల్గి ఉండాలని డిఆర్ఓ అంబాదాస్ రాజేశ్వర్ రెవెన్యూ సిబ్బందికి సూచించారు.బుధవారం కలెక్టర్ లోని మీటింగ్ హాల్లో సిబ్బందికి ఒక రోజు వర్క్ షాప్ నిర్వహించారు. రెవెన్యూలో పని చేసే జూనియర్ అసిస్టెంట్లు కీలకంగా విధులు నిర్వహించాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం భూ రికార్డుల నిర్వహణను మెరుగుపరచడానికి, పాత వ్యవస్థలోని లోపాలను సరిదిద్దడానికి తీసుకువచ్చిన సమగ్ర నూతన రెవెన్యూ భూ హక్కుల చట్టమే భూ భారతి చట్టం అన్నారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు.

## సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలి

**ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు**



**ముద్ర ప్రతినిధి, మెదక్:** సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్నకొద్దీ సైబర్ నేరాలు కూడా కొత్త రూపాల్లో పెరుగుతున్నాయని, ప్రజలు డిజిటల్ ప్రపంచంలో అప్రమత్తం గా వ్యవహరించాలని ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు సూచించారు. జాతీయ 'సైబర్ జాగృత్ దివస్' సందర్భంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'సురక్షా కా తిరంగా—సైబర్ స్వతంత్ర తెలంగాణ' కార్యక్రమంలో భాగంగా బుధవారం మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైబర్ అవగాహన కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడారు.

తెలంగాణలో ప్రతిరోజూ సైబర్ నేరాల కారణంగా కోట్ల రూపాయలను ప్రజలు నష్టపోతున్నారని ఎస్పీ తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే నకిలీ స్టాక్ మార్కెట్ పెట్టుబడి ప్రకటనలను చూసి మోసపోవద్దని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు, ఏటీఎం, డెబిట్ కార్డు వివరాలు వంటి వ్యక్తిగత, ఆర్థిక సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దని ఎస్పీ సూచించారు.సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలు, ఫేక్ అకౌంట్లు, ఫిషింగ్ లింకులు తదితర సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయడంతో పాటు నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ లో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, డీఎస్పీలు సుభాష్ చంద్రబోస్, ప్రసన్నకుమార్, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. కే. హుస్సేన్, డా.టి. మల్లేశం, వి. మురళి, డాక్టర్ ఆర్. శ్రీలత, సైబర్ క్రైమ్ సిబ్బంది సతీష్, సయ్యద్, సాయికిరణ్, స్వప్న, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## డిసెంబర్‌లో "తెలంగాణ రైజింగ్–2026" గ్లోబల్ సమ్మిట్‌కు విస్తృత ఏర్పాట్లు

**- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు**



**ముద్ర, హైదరాబాద్, :** డిసెంబర్‌లో జరగనున్న "తెలంగాణ రైజింగ్–2026" గ్లోబల్ సమ్మిట్ విజయవంతం అయ్యేలా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రైజింగ్–2047 లక్ష్యాల సాధనలో భాగంగా రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు ఈ సమ్మిట్ కీలక వేదికగా నిలుస్తుందని చెప్పారు. సమ్మిట్‌ను భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ప్రాంగణంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని, రహదారులు, విద్యుత్, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలను ముందుగానే సిద్ధం చేయాలని సూచించారు.పెట్టుబడులు, పారిశ్రామికాభివృద్ధి, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన, డిజిటల్ సేవల విస్తరణ వంటి అంశాలపై సమావేశంలో అధికారులు చర్చించారు. ఇందులో కె. రామకృష్ణారావు, శశాంక, అజిత్ రెడ్డి, కృష్ణ ఆదిత్య తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు, ఎక్స్–అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, టీజీఐఐసీ ఎండి శశాంక, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ అజిత్ రెడ్డి, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ క్రైమ్ పై యువత అప్రమత్తంగా ఉండాలి

*** మరో పదిమందికి అవగాహన కల్పించాలి**
*** క్రైమ్ రేట్ సైబర్ క్రైమ్ లోనే అధికంగా ఉంది**
**విద్యార్థులతో సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్**




**ముద్ర ప్రతినిధి,సిద్దిపేట :** సైబర్ క్రైమ్ పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ సూచించారు. సిద్దిపేట పోలీస్ ఆధ్వర్యంలో సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో "సురక్ష తిరంగా " కార్యక్రమంలో భాగంగా సైబర్ క్రైమ్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ అనుచిత ఫైల్లు, మెయిల్స్, మెస్సేజ్ లను ఓపెన్ చేయవద్దన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ప్రజల్లో అవగాహన పెరుగుతుందన్నారు. యువత డ్రగ్స్ ఇల్లీగల్ ఆక్టివిటీస్ లకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులు క్షనికావేశం లో ఆత్మహత్య లాంటి నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. పరీక్షలు జీవితం లో భాగం మాత్రమే అని అవే జీవితం కాదాన్నారు. తాను కూడా గతం లో ఎన్నో పరీక్షల్లో ఫెయిల్ అయ్యానని చివరికి IPS, లో పాస్ అయ్యానని తెలిపారు. ఫెయిల్ అయినంత మాత్రాన అక్కడే ఆగిపోవాద్దన్నారు. అనాలోచితంగా ఎలాంటి ఆవేశ పూరితా నిర్ణయాలు తీసుకోవద్దన్నారు. అనంతకు ముందు విద్యార్థుల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ కుశల్కర్, ప్రభుత్వ డిగ్రీ కాళశాల వైస్ ప్రిన్సిపల్ అయోధ్య రెడ్డి, ఏసీపీ రవీందర్ రెడ్డి, సైబర్ క్రైమ్ డి ఎస్పీ రాజు, పపాల్గొన్నారు.

# రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలి

**సిద్దిపేటలో విద్యుత్ శాఖ ఎస్ఈకు సిద్దిపేట జిల్లా బీజేపీ కిసాన్ మోర్చా వినతి**



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :** రైతులకు నాణ్యమైన,నిరంతర విద్యుత్ సరఫరా అందించడంతో పాటు విద్యుత్ సంబంధిత సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా సిద్దిపేట జిల్లా ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్ఈ)కు బుధవారం వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా కిసాన్ మోర్చా నాయకులు మాట్లాడుతూ వ్యవసాయానికి విద్యుత్ అత్యంత కీలకమైనదని,అయితే ప్రస్తుతం జిల్లాలో రైతులు అనేక విద్యుత్ సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.విద్యుత్ సరఫరాకు నిర్దిష్ట సమయపాలన లేకపోవడంతో రైతులు రాత్రింబవళ్లు మోటార్ల స్టార్టర్ల వద్దే వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంటోందని పేర్కొన్నారు.ఓవర్లోడ్‌తో పనిచేస్తున్న ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని,పంట పొలాల్లో ప్రమాదకరంగా ఉన్న లూజ్ విద్యుత్ స్తంభాలను వెంటనే బిగించాలని డిమాండ్ చేశారు.అలాగే పొలాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను వీలైనంత వరకు రహదారి పక్కకు మార్చి నిర్వహణ పనులు సులభంగా జరిగేలా చర్యలు చేపట్టాలని కోరారు.ప్రతి సబ్‌స్టేషన్ పరిధిలో సీఎల్,జేఎల్ఎం,ఏఎల్ఎం సిబ్బందిని రైతులకు అందుబాటులో ఉంచి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని,లో వోల్టేజ్ సమస్యను శాశ్వతంగా నివారించి తగిన వోల్టేజ్‌తో నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు.రైతుల సమస్యలను అత్యవసరంగా పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాలని,రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ శాఖ స్పందించాలని బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు కోరారు.ఈ కార్యక్రమంలో బిజెపి కిసాన్ మోర్చా సిద్దిపేట జిల్లా అధ్యక్షులు వల్లపు రెడ్డి రజనీకర్ రెడ్డి బీజేపీ నంగునూరు మండల్ అధ్యక్షులు చౌడిచర్ల వెంకటరామిరెడ్డి,కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి ముత్తినేని రాజు,రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నత్తి తిరుమల్ రెడ్డి,ఉపాధ్యక్షులు పరకాల తిరుపతిరెడ్డి, కోశాధికారి నారాయణరెడ్డి, జిల్లా కార్యదర్శి మర్కంటి ఏకొండ,సుతారి కార్తీక్ ముదిరాజ్ , జిల్లా రైతులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల అభివృద్ధికి ఉపాధ్యాయులు పాటు పడాలి

*** ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలి**
**సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి**





**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :** క్రమశిక్షణతో మెలుగుతూ సమయపాలన పాటించి విద్యార్థులు వృద్ధిలోకి వచ్చేలా విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఉపాధ్యాయులను ఆదేశించారు.బుధవారం సిద్దిపేట పట్టణంలో టిటిసి భవనంలోని సమావేశ మందిరంలో ఎంఈఓ లు, కాంప్లెక్స్ హెడ్మాస్టర్లు, హై స్కూల్ హెడ్మాస్టర్లు, తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపాళ్ళు, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించి విద్యాశాఖ పనితీరుపై సమీక్షించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యాశాఖ అత్యంత ముఖ్యమైనదని రాష్ట్ర ముఖ్యమంత్రి దగ్గరే ఉంచుకొని పర్యవేక్షిస్తున్నారని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆశయాల మేరకు ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన జరిగి మంచి ఫలితాలను తీసుకురావాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల ఎన్రోల్మెంట్ లక్ష్యానికి అనుగుణంగా జరగలేదని ఆగ్రహం వ్యక్తం చేసి నిర్లక్ష్యం వీడి ఎన్రోల్మెంట్ పెంచాలని అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ జెడ్పీ హైస్కూల్లో ప్రవేశానికి పోటీ ఎందుకు ఉందని ?, ఇదే సిద్దిపేటలోని ఇంటిగ్రేటెడ్ బాయ్స్ హై స్కూల్లో ఎన్రోల్మెంట్ ఎందుకు సరిగా లేదని ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు అన్ని సక్రమంగా ఉన్నా కూడా ఉపాధ్యాయుల పనితీరు సరిగా లేకపోవడం, నమ్మకం లేకపోవడంతో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆధార్ అప్డేట్ రేపటి లోగా పూర్తి చేయాలని అన్నారు.

విద్యా రంగానికి సంబంధించిన అన్ని ఇండికేటర్స్ పెంచుతూ విద్యారంగంలో జిల్లాను అగ్రస్థానంలో నిలిపేలా విద్యాబోధన చేయాలని, ప్రతి మండలానికి ఒక పాఠశాలను ఇందిరానగర్ జడ్పీ స్కూల్ లాగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్, ఏఎంఓ రామస్వామి, మండల విద్యాశాఖ అధికారులు, గెజిటెడ్ హెచ్ఎంలు, కాంప్లెక్స్ హెచ్ఎంలు, తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపాళ్ళు, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L. N. Colony, New IDA, Uppal, Hyderabad 500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H. No. 7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNL Reg. No. TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555